
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 12.02.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 37 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# బలయ్యేది ఎవరు బలిజలా బలహీనులా?

- చంద్రబాబుకు ముందు నుయ్యి.. వెనుక గొయ్యి!
- బాబు ఎత్తుగడకు లొంగిన ముద్రగడ
- బి.సిల ఉద్యమాలతో టీడీపీకి గుండె దడ

**కాలికి బురద అంటుకుంటే కడుక్కుంటే పోద్ది. కుల గజ్జి, మత పిచ్చి వంటివి అంటించుకుంటే మాత్రం అంత తొందరగా పోవు. దేశంలో కులతత్వం పోవాలని, మత వైషమ్యాలు తొలగాలని ఓ పక్క ప్రజాస్వామ్యవాదులు పోరాడుతుంటే మరోపక్క రాజకీయ నాయకులే కులాల కుంపట్లను రగిలిస్తూ, మత వైషమ్యాలను రెచ్చగొడుతున్నారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో చెలరేగిన కుల పోరాటాలకు ఆద్యుడు, బాధ్యుడు ముఖ్యమంత్రి చంద్రబాబే! 2014ఎన్నికల్లో తన రాజకీయ స్వార్థం కోసం తాను రేపిన కులచిచ్చే ఈరోజు రాష్ట్రంలో రావణకాష్టంలా రగులుకుంది.**

ప్రస్తుతం కుల పోరాటాలతో రాష్ట్రం అట్టుడుకుతోంది. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇంతవరకు కులపోరాటాలు లేవు. కులపరంగా ఉద్యమాలు, ఆందోళనలు లేవు. రాష్ట్రంలో ఎన్నో కులాల వాళ్లుంటున్నా కలిసిమెలిసే వుంటున్నారు. రాజకీయంగా కూడా కులపరమైన చీలికలు లేవు. గతంలో కాపులకు రిజర్వేషన్‌లు కావాలంటూ కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభం దీక్షలు చేసినా ఆ తర్వాత దాని గురించి పట్టించుకున్న వాళ్లు లేరు. కాని 2014 ఎన్నికల్లో కాపులకు రిజర్వేషన్లు ఇస్తామని వారికి లేని ఆశలు కల్పించింది చంద్రబాబే! అంటే నిశ్శబ్దంగా వున్న కులతత్వాన్ని ఆయనే తట్టి లేపాడు. ఆ మాటతో ఓట్ల పరంగా లబ్దిపొందాడు. కాపులకు రిజర్వేషన్లు ఇస్తానని ఈరోజు ముఖం చాటేయలేదు కదా? కాపులు అదే డిమాండ్ చేస్తున్నారు. 'తుని' సభతో మొదలైన 'కాపు' కలహం చంద్రబాబును బాగానే చుట్టుకుంది. తన కమ్మని మాటలతో ముద్రగడ చేత దీక్ష విరమింపజేసినా కాపులు మాత్రం చంద్రబాబును పూర్తిస్థాయిలో నమ్మే పరిస్థితి లేదు.

ఇప్పుడు కాపులను బిసిల్లో చేర్చడమనేది చంద్రబాబుకు ముందు నుయ్యి, వెనుక గొయ్యి సామెతే! బీసీల్లో చేర్చుకుంటే కాపులు తెలుగుదేశంకు శాశ్వత శత్రువులవుతారు. చేరిస్తే తెలుగుదేశం (మిగతా 11వ పేజీలో)

## • నెల్లూరు

# టెండర్లలో వండర్లు



- మేయర్ చేతిలో టెండర్ బాక్స్ గది తాళం
- కార్పొరేషన్‌లో శృతిమించిన అవినీతి మేళం

**దొంగలు దొంగలు ఊర్లు పంచుకోవడం గురించి కథలలో విన్నాం. ఇక రౌడీషీటర్లు ఏరియాలను పంచుకుని దాదాగిరిలు చేయడం వంటివి సినిమాలలోనే కాదు, నిజజీవితంలో కూడా చూస్తుంటాం. ఇలాంటిదే ఇప్పుడు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా జరిగింది. మేయర్, కార్పొరేటర్లు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై నెల్లూరుకు మంజూరైన పనులలో కమిషన్లను వాటాలేసి పంచుకున్న విషయం వెలుగులోకి వచ్చింది.**

2014లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మేయర్‌గా వున్న అజీజ్ గాని, కార్పొరేటర్లుగా ఎన్నికైన వాళ్లుగాని బాగానే పెట్టుబడి పెట్టారు. ఇప్పుడు రాబడి మార్గాలపై పడ్డారు. ఇటీవల 13వ ఆర్థిక సంఘం నిధులు 13.75కోట్లు నెల్లూరుకు మంజూరయ్యాయి. ఈ నిధులతో పలు డివిజన్‌లలో 51పనులకు టెండర్లను పిలవడం జరిగింది. టెండర్లకు ముందే మేయర్ అజీజ్ హరనాథపురంలోని (మిగతా 11వ పేజీలో)

## • హైటెక్ బాబుకు

# హైదరాబాద్ పిచ్చి వదిలేనా?




- కేసీఆర్ కారుకు ఫ్యాన్సీ నెంబర్
- దేశంకు నెంబర్ 1
- గ్రేటర్‌లో దిమ్మతిరిగే తీర్పు

**హైదరాబాద్... హైదరాబాద్... ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఆంధ్రాలో వున్నా, అమెరికాలో వున్నా ఇదే కలవరింత. ఆయన పుట్టి పెరిగిన నారావారిపల్లె మీద గాని, ఆయనకు రాజకీయంగా జన్మనిచ్చిన కుప్పం మీదగాని ఇంత ప్రేమ చూపించి ఉండడు. హైదరాబాద్ అంటే ఆయనకు ప్రేమ కాదు పిచ్చి. హైదరాబాద్ నగరం పట్ల నిజాం నవాబులు కూడా ఇంత వ్యామోహం చూపి ఉండరు.**

2014లో ఆంధ్రప్రదేశ్‌ను చీల్చి హైదరాబాద్‌ను వేరు చేసాక కూడా చంద్రబాబుకు ఆ పిచ్చి తగ్గలేదు. కేసీఆర్ ఛీఛీ... మా హైదరాబాద్‌ను వదిలిపో అని తరిమినా, ఓటు-నోటు కేసు పెట్టి మా హైదరాబాద్‌కు రావొద్దని బెదిరించినా చంద్రబాబు మనసు మారలేదు. హైదరాబాద్‌లో ఆయనకు ఇంతవరకు వున్న బలం, నమ్మకం సెటిలర్స్. 1983లో తెలుగుదేశం పార్టీని పెట్టిందిమొదలుకొని హైదరాబాద్‌లో ఆ పార్టీ బలంగా వేళ్లూనుకుంది. బల్దియా కార్పొరేషన్‌లో ఇంత కాలం ఎంఐఎంకు ధీటుగా నిలిచింది కూడా తెలుగుదేశమే! గతంలో చంద్రబాబు హయాంలోనే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో తెలుగుదేశం (మిగతా 11వ పేజీలో)



# ఇరకంకు పర్యాటక సోయగం



నెల్లూరుజిల్లా తడ మండలంలోని ఇరకం దీవిని పర్యాటక కేంద్రంగా అభి వృద్ధి పరచేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాటలు వేశాయి. ఇరకం దీవితో పాటు, భీమునివారిపాళెం తదితర పులికాట్ పరిస రాల్లో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్రప్రభుత్వం రూ.26కోట్ల నిధులు మంజూరు చేయగా, ఇదివరకే దీవిలో పర్యాటకశాఖకు 80ఎకరాలు ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఈమేరకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫి (ఎన్ఐఓజీ) కేంద్ర బృందం ఇటీవల సర్వే చేపట్టింది. ఆ భూమి సరస్సుకు ఎంత దూరంలో ఉందన్న విషయంపై ఎన్ఐఓజీ అధికారులు సర్వే చేపట్టారు. పర్యాటక శాఖకు కేటాయించిన స్థలం సరస్సు నుంచి 200మీటర్ల లోపలే వుంటే ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని, 200-500 మీటర్ల లోపు ఉంటే తాత్కాలిక కట్టడాలు నిర్మించుకోవచ్చని, 500మీటర్ల కన్నా ఎక్కువ దూరంలో శాశ్వత కట్టడాలు నిర్మించుకోవచ్చని బృంద అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. ఇరకం దీవితో పాటు భీమునివారిపాళెం, వేనాడు పరిసర ప్రాంతాల్లో బృందం సర్వే జరిపింది. ఈ బృందంలో జవహర్‌కుమార్, వైయస్ఎన్ రాజు, ఎన్‌సిపి రెడ్డి పాల్గొన్నారు.

# సాగునీటి కాలువలను చూసిన జపాన్ టీమ్



అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సాగునీటి రంగాన్ని అభివృద్ధి చేసేందుకు జపాన్ బృందం ఈ నెల 7న జిల్లాలో విస్తృతంగా పర్యటించింది. ఈ జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆర్డినేషన్ ఏజెన్సీ ఇంజనీరింగ్ బృందం సాగునీటి రంగం అభివృద్ధికి మన రాష్ట్రం జపాన్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు జపాన్ బృందం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వున్న సాగునీటి వనరులను పరిశీలించింది. ఈ కార్యక్రమంలో భాగంగా బోగోలు, కావలి రూరల్, దగదర్తి, రాపూరు, సంగం తదితర మండలాల్లో పర్యటించింది. దగదర్తి-రాచర్లపాడు, దగదర్తి-ముంగమూరు కాలువలను పరిశీలించింది. అదేవిధంగా బోగోలు మండలంలో డిఎం ఛానల్‌ను, అక్కరాజువారి కండ్రిగ, నాగులవరం మధ్య వున్న దగదర్తి-ముంగమూరు ఛానెల్ తదితర కాలువలను పరిశీలించింది. ఆ తర్వాత ఆసియా ఖండంలోనే మరెక్కడా లేని విధంగా మట్టికట్టతో అత్యంత అద్భుతంగా నిర్మించిన కండలేరు డ్యామ్‌ను పరిశీలించారు. 68టిఎంసిల సామర్థ్యంతో నిర్మించిన ఈ డ్యామ్‌ను పరిశీలిం చేందుకు జపాన్ బృందం రాపూరు మండలంలోని కండలేరు జలాశయం వద్దకు విచ్చేసింది. తెలుగు గంగ ఛీఫ్ ఇంజనీర్ సుధాకరరావు తదితరులు ఈ డ్యామ్ వివరాలను జపాన్ బృందానికి వివరించారు. ఈ మట్టికట్టను మరింత వెడల్పు చేసి అత్యంతాధునిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేయాలని భావిస్తున్నామని, అందుకు దాదాపు రెండువందల కోట్ల రూపాయల దాకా వ్యయమవుతుందని ఆయన జపాన్ బృందానికి తెలిపారు. ఆ మేరకు అంచనాలు సిద్ధం చేసి పంపుతామన్నారు. ఆ వివరాలు పరిశీలించిన జపాన్ బృందం ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను కేటాయించేందుకు తాము కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సంగం ఆనకట్టను పరిశీలించారు. జిల్లాలోని సాగునీటి వనరుల అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు తమ దేశానికి తగు నివేదికలను తాము సమర్పిస్తామని జపాన్ బృందం పేర్కొంది. ఈ పర్యటనల్లో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, పెన్నా డెల్టా ఛైర్మెన్ గోవర్ధన్‌రెడ్డి, వైస్ ఛైర్మెన్ మాలేపాటి సుబ్బానాయుడు, కావలి ఏఎంసి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం, రైతు సంఘం నాయకుడు ఓబుల్‌రెడ్డి, ఆత్మకూరు టిడిపి ఇన్‌ఛార్జి గూటూరు మురళీకన్నబాబు, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మెన్ రాపూరు సుందరరామిరెడ్డి లతో పాటు నీటిపారుదలశాఖ, తెలుగుగంగ అధికారులు పాల్గొన్నారు.

# కండలేరు మీదే కొండంత ఆశ

కండలేరు జలాశయం మీదే రైతన్నలు ఆశలు పెంచుకున్నారు. కండలేరు కాలువ కింద చేజర్ల, పొదలకూరు, మనుబోలు, నెల్లూరు రూరల్ మండలాల్లో 21వేల ఎకరాల ఆయకట్టుకు 27టిఎంసీలకు మించి నీరుంటేనే నీటి సరఫరా జరుగుతుంది. దీంతో వర్షాకాలంలో రెండు నెలల పాటు కాలువకు నీరొచ్చినా జలాశయంలో నీటి మట్టం తగ్గితే కాలువకు నీటి సరఫరా ఆగిపోతుంది. ఈ సమస్యను తీర్చేందుకు రూ.68కోట్ల వ్యయంతో కండలేరు దిగువ కాలువ నుంచి ఎగువ కాలువకు ఎత్తిపోతల నిర్మాణం చేపట్టారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి పొదలకూరు పర్యటన సందర్భంగా ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. కండలేరు జలాశయం ఎత్తిపోతల పథకం వేగంగా పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి హామీ కూడా ఇచ్చారు. దీంతో రైతుల్లో ఆశలు రేగాయి. కరువు కారణంగా నిమ్మతోటలు ఎండిపోవడంతో ఈ భూముల్లో రైతులు మినుము, పెసర వేశారు. భారీవర్షాలకు ఆ పైర్లు తుడిచిపెట్టుకు పోయాయి. కండలేరుకు నీరు చేరడంతో రైతులు వరిసాగుకు సిద్ధమయ్యారు. జలాశయం సగభాగమే నిండినా ఎత్తిపోతలపై ఆశలతో మెట్ట భూముల్ని మాగాణిగా మార్చి వరిసాగు చేపట్టారు. కాలువ నిర్మాణం పూర్తయ్యాక తొలిసారిగా ఈ యేడాది ఎడమకాలువ కింద భారీగా వరిసాగు వేశారు. కండలేరు ఎడమ కాలువకు నీరొస్తే తిండిగింజలు, పశువుల మేత కొరత తీరుతుందని రైతులు ఆశపడుతున్నారు.

సింహపురి సమాచారం

## వంద రూపాయలకే ఇసుక ఇవ్వాలి

ప్రభుత్వం క్యూబిక్ మీటర్ ఇసుకను రూ.100కే ఇవ్వాలని, నెల్లూరుజిల్లాలోని భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియూ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్ వద్ద వారు ధర్నా చేశారు. ఇసుక మాఫియాకు తావు ఇవ్వకుండా ఇసుకను మైనింగ్ భూగర్భశాఖ ద్వారానే ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు. పేదలకు క్యూబిక్ మీటర్ ఇసుకను రూ.35కే ఇవ్వాలన్నారు. ధర్నాలో సంఘం కార్యదర్శి చాన్‌బాషా, నాగేశ్వరరావు, రమణయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో కాశినాయన వేడుకలు

నెల్లూరుజిల్లా సీతారామపురం మండలం నెమళ్లదిన్నె పంచాయితీ బెడుసుపల్లిలో కాశినాయన 121వ జయంతి వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. మూలవిరాట్టును, ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంక రించారు. నెమళ్లదిన్నె యువత ఆధ్వర్యంలో భక్తుల కోసం ఉచిత ఆటో సర్వీసు, వైద్య, తాగునీటి శిబిరాలు ఏర్పాటు చేశారు. నెల్లూరు జిల్లా వాసులే కాకుండా కడప, కర్నూలు, ప్రకాశం, అనంతపురం, గుంటూరు జిల్లాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. గ్రామంలో కాశినాయన స్నానమాచరించిన బావిని సందర్శించారు.

## జనవిజ్ఞాన వేదిక నూతన కమిటి

నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో సోమవారం జేవివి, ప్రజాసైన్స్ వేదిక సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి నూనె నారాయణ ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. నెల్లూరుజిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఎ.వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా అవ్వారు శ్రీధర్‌బాబు, కోశాధికారిగా బాబునాయుడు, ఉపాధ్యక్షు లుగా ఎంపి నరశింహారెడ్డి, పోలయ్య, ఎంవి నారాయణ, ఎన్.సుబ్రహ్మణ్యం, చెన్నకేశవులు, కార్యదర్శులుగా బసిరెడ్డి శీనయ్య, జిలానీ, కె.సుబ్బయ్య, కృష్ణయ్య, కల్చరల్ కార్యదర్శిగా బి.శేషు, మహిళా కార్యదర్శులుగా లీలమ్మ, వహీదా, వేదవల్లి, ఆశ, నారాయణమ్మలను ఎన్నుకున్నారు.

## దీప్తి నర్సింగ్‌హోంలో

# అధునాతన టెక్నాలజీతో ఆపరేషన్



ఎటువంటి ఆపరేషన్‌లనైనా అవలీలగా చేస్తాడనే పేరున్న నెల్లూరు బృందావనంలోని దీప్తి నర్సింగ్‌హోం అధినేత, ప్రముఖ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ ఎస్.లోకనాథం తమ ఆసుపత్రిలో మరో అరుదైన ఆపరేషన్ చేశారు. కోయడం, కుట్లు వేయడం వంటి పాత పద్ధతిలో కాకుండా పేషంట్‌కు ఎటువంటి ఇబ్బంది కలగని రీతిలో స్పిన్‌రోల్ టెక్నిక్ విధానం ద్వారా చంద్రకళ(41) అనే మహిళ గర్భాశయంలో ఏర్పడ్డ కణితను తొలగించారు. గతంలో యాన్‌ప్లేటర్మీ అనే పరికరం ద్వారా గర్భాశయంలో ఉండే కణితను ముక్కలు ముక్కలుగా చేసి తొలగించేవాళ్లు. ఈ పద్ధతిలో పేషంట్‌కు సైడ్‌ఎఫెక్ట్‌తో పాటు ఆపరేషన్ సమయంలో మూత్రాశయ ద్వారానికి గాయాలు అయ్యే అవకాశం ఉండేది. ఈ పద్ధతిపై నిషేధం వుంది కూడా! దీనివల్ల ఉదరంపై కోసి ఆపరేషన్ చేయాల్సి వచ్చేది. ఇది కూడా ఇబ్బందే! ఈ ఇబ్బందులేమీ లేకుండా డాక్టర్ లోకనాథం స్పిన్‌రోల్ టెక్నాలజీతో మూడు గంటల పాటు శ్రమించి శస్త్ర చికిత్స పూర్తి చేశారు. ఈ పద్ధతిలో కుట్లు కూడా లేక పోవడంతో పేషంట్ త్వరగానే కోలుకుని తన పని తాను చేసుకుంటుంది. ఈ శస్త్ర చికిత్సలో డాక్టర్ లోకనాథంకు డాక్టర్ సుమతి, వారి వైద్య బృందం సహకరించి విజయవంతం చేసింది.

# హాకీలో సత్తా చాటిన నెల్లూరు జట్టు

హాకీలో నెల్లూరు జట్టు సత్తా చాటుకుంది. అనంతపురం జిల్లాలోని ధర్మవరంలో ఇటీవల నాలుగురోజుల పాటు జరిగిన వీరాస్వామి మెమోరియల్ ఆలిండియా హాకీ టోర్నీలో నెల్లూరు జట్టు బెల్గాం జట్టుపై విజయం సాధించి తన ప్రతిభను చాటుకుంది. తొలుత, ధర్మవరం-నెల్లూరు జట్లు సెమీఫైనల్స్‌కు చేరగా, 2-1 గోల్స్ తేడాతో ధర్మవరంపై విజయం సాధించి, నెల్లూరు జట్టు ఫైనల్స్‌కు చేరుకుంది. ఫైనల్స్‌కు చేరుకున్న నెల్లూరు-బెల్గాం జట్లు రెండూ ఒక్క గోల్ కూడా చేయకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించి, ఫలితం కోసం ఫైనల్ స్ట్రోక్ నిర్వహించారు. ఈ పోటీలో 5-5 గోల్స్‌తో రెండు జట్లు సమానంగా నిలిచాయి. అయితే, చివర్లో నెల్లూరు జట్టు క్రీడాకారుడు మణికంఠ అద్భుతంగా ఆడి గోల్ సాధించడంతో నెల్లూరు జట్టు ఈ పోటీలో విజయకేతనం ఎగురవేసింది. నెల్లూరు జట్టు ట్రోఫీ అందుకుంది. ధర్మాంబ హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలో ఆ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు, శాప్ డైరెక్టర్ సత్యగీత, హాకీ ఆసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్‌రెడ్డి, టిటిడి బోర్డు సభ్యుడు హరిప్రసాద్ తదితరులు పాల్గొని విజేతలైన నెల్లూరుజట్టు క్రీడాకారులకు బహుమతులందజేసి అభినందించారు.

# సోమశిలలో 47.35 టిఎంసిల నీరు

ఈ నెల 7వ తేదీ నాటికి సోమశిల జలాశయంలో 47.351 టిఎంసిల నీరు నిల్వ వుంది. పెన్నార్ డెల్టాకు 3400క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 360క్యూసెక్కులు, దక్షిణ కాలువకు మరో 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి.

# ప్రాణాలతో చెలగాటం

## విద్యుత్ స్థంభాలు తొలగించకుండా రోడ్డు పనులు

అధికారుల పర్యవేక్షణ లోపించడంతో రోడ్డు పనులను కాంట్రాక్టర్ తన ఇష్టానుసారంగా చేస్తుండడంతో ప్రజలకు, ప్రయాణీకులకు ప్రమాదం పొంచివుంది. నెల్లూరుజిల్లా దుత్తలూరు మండలంలో 565వ నెంబరు జాతీయ రహదారి పనులు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. ప్రకాశం జిల్లా వగ్గంపల్లి నుంచి జిల్లా సరిహద్దు దోర్నాల వరకు గత ఏడాదిన్నరగా జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. ఈ రహదారి వెంట ఉన్న విద్యుత్ స్థంభాలను తొలగించిన తర్వాత రోడ్డు పనులు చేయాల్సి వుంది. జాతీయ రహదారి పనులు దక్కించుకున్న సంబంధిత కంపెనీ ప్రతినిధులు మాత్రం ప్రయాణీకులకు ప్రమాదం అని తెలిసినా విద్యుత్ స్థంభాలను తొలగించకముందే రోడ్డు పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో రోడ్డు పెంచడంతో పైన వున్న విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారి వాహనాలకు తగులుతు న్నాయి. జాతీయ రహదారి వెంట ఉండే ట్రాన్స్‌ఫార్మర్‌లను, స్థంభాలను మార్చకుండానే పనులు చేపడుతుండటంతో గ్రామస్థులు, ప్రయాణీకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరం.

### సిఎం పర్యటన

# ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



ఈనెల 27వతేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రులు పియూష్ గోయల్, యం.వెంకయ్యనాయుడులు నెల్లూరుజిల్లాలోని కృష్ణపట్నం పోర్టు సెజ్ పరిధిలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేస్తున్న నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టర్ ఈ ప్రాంతాల్లో పర్యటించారు. సిఎం, కేంద్రమంత్రుల పర్యటనా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. నేలటూరు వద్ద గల ఏపి జెన్‌కో విద్యుత్ కేంద్రాన్ని, కృష్ణపట్నం పోర్టును ఆమె సందర్శించి అక్కడి అధికారులతో ఏర్పాట్లపై మాట్లాడారు.

### ముఖ్యమంత్రి చేతులమీదుగా

# సెంబ్ కార్ప్ పవర్ ప్రాజక్ట్ ప్రారంభం

నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం నేలటూరు వద్ద రాజ్యసభ సభ్యులు, నెల్లూరీయుడు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి సారథ్యంలో నిర్మించిన సెంబ్ కార్ప్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రాజెక్టును ఈ నెల 27వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రులు యం.వెంకయ్యనాయుడు, పియూష్‌గోయల్‌ల చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తన సొంత జిల్లాలో జరుగుతున్న పారిశ్రామిక ప్రగతి యజ్ఞంలో తానూ పాలుపంచుకోవాలనే లక్ష్యంతో టీఎస్ఆర్ దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఇక్కడ గాయత్రి పవర్‌ప్రాజెక్ట్ నిర్మాణానికి అనుమతి పొందారు. తర్వాత సింగపూర్‌కు చెందిన సెంబ్ కార్ప్ కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకుని 660మెగావాట్ల కెపాసిటీతో 2యూనిట్లు నెలకొల్పారు. మొత్తం 1320 మెగావాట్ల సామర్థ్యంతో ప్రైవేట్ విద్యుత్ రంగానికే తలమానికంగా ఈ ప్రాజెక్టును పూర్తి చేశారు. ఈ నెల 27న సీఎం, కేంద్రమంత్రుల చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ముస్తాబు చేశారు.

# చాట్లకు మెడికల్ కుర్చీ



వడ్డించేవాడు మనవాడైతే బంతి చివర కుర్చున్నా ఇబ్బంది లేదనేది పాత సామెత. అధికారపార్టీలో పవర్ చూపించేవాడు మనవాడైతే పార్టీలో ఎప్పుడు చేరినా పదవి ఖాయమనేది కొత్త సామెత. దశాబ్దాల తరబడి తెలుగుదేశం పార్టీ జెండాలు మోసి భుజాలు కాయలు కాసిన కార్యకర్తలు పదవుల కోసం నోరెళ్లబెట్టి చూస్తుండగా, నిన్నగాక మొన్న తెలుగుదేశంలో చేరిన చాట్ల నరసింహారావుకు ఓ గౌరవప్రదమైన పదవి దక్కింది. నెల్లూరులోని ఏ.సి.సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాల అభివృద్ధి కమిటి ఛైర్మెన్‌గా మాజీకార్పొరేటర్ చాట్ల నరసింహారావును నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ కో-ఛైర్మెన్‌గా ఉంటారు. పెద్దాసుపత్రి సూపరింటెండెంట్, వైద్యకళాశాల ప్రిన్సిపాల్, కమిషనర్‌తో పాటు ఇంకొందరు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ప్రభుత్వ వైద్యకళాశాలల్లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనుల పర్యవేక్షణ, వైద్యుల విధులు వంటివన్నీ కూడా ఛైర్మెన్ పర్యవేక్షిస్తారు.

చాట్లకు ఈ పదవి రావడంలో మంత్రి పి.నారాయణ ఆశీస్సులున్నాయనేది బహిరంగ రహస్యం. దాదాపు 20ఏళ్లకుపైగా కాంగ్రెస్‌లో వుండి ఆనం అనుచరులలో టాప్‌టెన్‌లో ఒకడిగా ముద్రపడ్డ చాట్ల నరసింహారావు 2014ఎన్నికల తర్వాత తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక మంత్రి నారాయణ పిలుపుతో ఆ పార్టీలోచేరాడు. మంత్రికి బ్రాండ్ అంబాసిడర్‌గా వుంటున్నాడు. మంత్రి నారాయణ పూనుకోబట్టే ఏళ్లతరబడి తెలుగుదేశంలో వుంటూ జట్టు, గడ్డాలు తెల్లబడిన వారిని కాదని చాట్లకు ఈ పదవి వచ్చింది. కలిసొచ్చే కాలానికి పదవి నడిచిరావడం అంటే ఇదే!

# సైనిక స్కూల్‌కు జడ్ఎస్ఆర్ విద్యార్థి



జనవరిలో జరిగిన సైనిక స్కూల్ ప్రవేశపరీక్షలలో నెల్లూరు జేమ్స్ గార్డెన్‌లోని నేతాజీ జడ్ఎస్ఆర్ హైస్కూల్ విద్యార్థి బి.హర్షవర్ధన్ ఎంపికయ్యారు. నవోదయకు శిక్షణ తీసుకున్న ముగ్గురు విద్యార్థులలో హర్షవర్ధన్ చిత్తూరుజిల్లా కలికిరిలోని సైనిక స్కూల్‌కు ఎంపికయ్యారు. ఈ విద్యార్థిని స్కూల్ కరస్పాండెంట్ జడ్.శ్రీనివాసులురెడ్డి అభినందించారు. తమ స్కూల్లో 2016-17 సంవత్సరానికి సైనిక స్కూల్, నవోదయ ప్రవేశ పరీక్షల శిక్షణకు లాంగ్‌టర్మ్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు.

### ● స్టూడెంట్ నెంబర్-1

# గజరావ్ భూపాల్, బి.ఏ



గతంలో పేరు చివర బి.ఏ అనే రెండక్షరాలు తగిలించుకుంటే ఎంతో గొప్పగా ఉండేది. మనం ఎక్కువగా దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన సినిమాలలో టైటిల్స్ ఆఖరులో ఆయన పేరు చివర బి.ఏ అని ఉండడం ఇప్పటికీ చూస్తుంటాం. మనకు తెలిసి బి.ఏ పట్టాకు రాఘవేంద్రరావు వల్ల చాలా గుర్తింపు వచ్చింది. ఈమధ్యకాలంలో అయితే బి.ఏ పట్టాలు నాలుక గీసుకోవడానికి కూడా పనికి రావడం లేదు. ఇలాంటికాలంలో కూడా బిఏ చదవడానికి ఓ వ్యక్తి ఉత్సాహం చూపాడు. బిఏ చదవాలనుకున్న ఆ వ్యక్తి ఆసక్తిని చూసి ఉన్నతాధికారులే ఆశ్చర్యపోతున్నారు. ఆ వ్యక్తి పేరే గజరావ్ భూపాల్.

నెల్లూరుజిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంకు చెందిన గజరావ్ భూపాల్ మొదట ఎంబిబిఎస్ చేశారు. తర్వాత సివిల్స్ వ్రాసి 2008లో ఐపిఎస్‌కు ఎంపికయ్యారు. పోలీసుశాఖలో వివిధ హోదాలలో పనిచేస్తూ ప్రస్తుతం నెల్లూరు ఎస్పీగా వున్నారు. ఈమధ్యే ముస్లింలతో వచ్చిన వివాదంలో రాష్ట్రంలోనే గుర్తింపు పొందారు. అయితే ఇప్పటివరకు చదివిన చదువులు ఆయనకు సంతృప్తినివ్వలేదు. ఇవన్నీ జీవితాన్ని గడపడానికి ఉపయోగపడుతున్నాయి తప్పితే సమాజాన్ని నడపడానికి ఉపయోగపడడంలేదు. అందుకే ఆయన సమాజాన్ని సంక్షిప్తంగా తెలుసుకోవడానికి బిఏ చదువుకోవాలనుకున్నారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్శిటీలో బిఏ కోర్సు చేరేందుకు అనుమతినివ్వాలంటూ ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నాడు. చదువు పట్ల ఆయన ఆసక్తిని గమనించిన ఉన్నతాధికారులు అనుమతినిచ్చారు. గజరావ్‌భూపాల్ ఓ పక్క ఎస్పీగా విధులు నిర్వహిస్తూనే మరోపక్క బిఏ పుస్తకాలు కూడా చదువబోతున్నాడు. బెస్టాఫ్‌లక్ టు స్టూడెంట్ నెంబర్1!

# శ్రీసిటీలో డెవలప్‌మెంట్ కమిషనర్ కార్యాలయం



శ్రీసిటీలో నూతనంగా నిర్మించిన డెవలప్మెంట్ కమిషనర్ కార్యాలయ భవనాన్ని శ్రీసిటీ డెవలప్మెంట్ కమిషనర్ అనిల్ కుమార్ చౌదరి గురువారం ప్రారంభించారు. స్థానిక బిజినెస్ సెంటర్ ఎదురుగా నిర్మించిన ఈ భవనంలో డెవలప్మెంట్ కమిషనర్ కార్యాలయంతో పాటు కస్టమ్స్ శాఖ కార్యాలయం, ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాలు పనిచేస్తాయి. ప్రస్తుతం డెవలప్మెంట్ కమిషనర్ మరియు కస్టమ్స్ శాఖ కార్యాలయాలు జాతీయ రహదారి చేరువలోనున్న విజిటర్స్ సెంటర్లో ఉన్నాయి. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ తమ సిబ్బంది పనిలో సామర్థ్యం, వేగం పెంచుకోటానికి అవసరమైన వాతావరణంతో పాటు అన్ని అధునాతన వసతులు ఈ నూతన కార్యాలయంలో సమకూర్చబడ్డాయన్నారు. శ్రీసిటి ఎండి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ సెజ్‌కు సంబంధించిన అనుమతులిచ్చే వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఈ నూతన భవనంలో అతిత్వరలో తమ సేవలు ప్రారంభిస్తాయని, తద్వారా మా కస్టమర్లందరికీ ఒకచోట అన్ని సేవలు అందించే కేంద్రంగా ఈ భవనం ఉపయోగపడుతుందన్నారు.

# మొక్కలు నాటిన విఆర్‌సి వాకర్స్



విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ నెల్లూరు విఆర్‌సి మైదానంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంటూరుకు చెందిన శ్యామల శ్రీనివాసులురెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రతి వస్తువు కలుషితమవుతున్న ఈరోజుల్లో స్వచ్ఛమైన గాలి కూడా కలుషితమవుతోదన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పందిళ్లపల్లి పట్టాభిరామిరెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు చెలికాని సీతారామయ్య, విఆర్‌సి వాకర్స్ గౌరవాధ్యక్షులు భాస్కరరావు, ఎస్‌వి సుబ్బారెడ్డి, పి.పెంచలయ్య, మూర్తి, వెంకటేశ్వర్లు, యం.రామసుబ్బారెడ్డి, ఎ.హజరత్తయ్య, సభ్యులు పాల్గొన్నారు.

### కాలధర్మం

# చిట్టమూరు పద్మనాభరెడ్డి



జిల్లా పరిషత్ మాజీ వైస్‌ఛైర్మెన్ చిట్టమూరు పద్మనాభరెడ్డి(90) 9వ తేదీ మంగళవారం చెన్నైలో కనుమూసారు. మనుబోలు ఆయన స్వగ్రామం. ఆయనకు భార్య అనసూయ, కుమార్తె నిర్మల ఉన్నారు. కుమారుడు మధుసూదన్‌రెడ్డి 2005 సంవత్సరం డిసెంబర్ 31వ తేదీన స్వర్గస్తులైనారు. దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డికి మధుసూదన్‌రెడ్డి ఎంతో ఆప్తమిత్రుడు. మధుసూదన్‌రెడ్డి మరణించాక ముఖ్యమంత్రి హోదాలో మనుబోలుకు వచ్చిన వై.యస్. రాజశేఖరరెడ్డి ఆ గ్రామ ప్రధాన రహదారికి తన మిత్రుడు మధుసూదన్‌రెడ్డి పేరు పెట్టి తన స్నేహానికి జ్ఞాపకంగా మిగిల్చారు. ఇక తమిళనాట తెలుగువాణిని వినిపిస్తూ చెన్నైలో నెల్లూరీయులు గర్వించదగ్గ వైద్యుడిగా గుర్తింపు పొందిన డాక్టర్ సిఎంకె రెడ్డి, పద్మనాభరెడ్డికి స్వయానా బావమరిది మరియు అల్లుడు కూడా! చిట్టమూరు పద్మనాభారెడ్డికి జిల్లా రాజకీయాలలోనే పెద్ద మనిషిగా పేరుంది. పలు దశాబ్దాలు మనుబోలు గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా ఆ గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. జిల్లాలోని అన్ని రాజకీయ కుటుంబాలతోనూ ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. 2000 సంవత్సరంలో జరిగిన జిల్లా పరిషత్ ఎన్నికల్లో మనుబోలు జడ్పీటీసీగా గెలిచిన ఈయనను జిల్లా పరిషత్ వైస్‌ఛైర్మెన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జడ్పీ వైస్‌ఛైర్మెన్ పదవిలో ఐదేళ్ల పాటు ఎంతో నిజాయితీగా సమర్థవంతంగా విధులు నిర్వహించి ఆదర్శప్రాయంగా నిలిచారు. ఆయన మరణవార్తతో మనుబోలు మండలం అంతా విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# 'ప్రభా'తం

ఇప్పుడే కాదు..ఎప్పుడైనా సరే, సాగరాలే సకల మానవాళికీ ఆశా దీపాలు. ప్రపంచ ప్రగతికి ఇవి రానున్న కాలంలో మరెం తగానో దోహదం చేస్తాయి. మానవాళి భవితకు ఇక ఇవే స్వర్ణ సోపానాలవుతాయి. అందుకే వీటిని కాలుష్య కాసారాలు కాకుండా కాపాడుకోవాలి. సముద్ర మార్గాలు దుర్వినియోగం కాకుండా పరిరక్షించుకోవాలి. అందుకు ప్రపంచ దేశాలన్నీ నడుం బిగించాలి.

సముద్రమార్గాల్లో, తీరాల్లో సుస్థిరమైన రక్షణ కావాలి. సముద్ర మార్గాలను ప్రమాదరహితంగా వుండేలా తీర్చిదిద్దుకోవాలి. ఆ తక్షణ కర్తవ్యాన్ని ప్రపంచదేశాలన్నిటికీ చాటిచెప్తూ మొన్నటికి మొన్న విశాఖపట్నం సముద్రతీరంలో జరిగిన అంతర్జాతీయ నౌకాదళ ప్రదర్శన (ఐఎఫ్ఆర్) ఆద్యంతం అద్భుతమైంది. ప్రపంచ ప్రగతికే ఇది సరికొత్త ఆశలకెరటమైంది.. 50కి పైగా దేశాలు పాల్గొని ప్రదర్శించిన సాగర సాహస విన్యాసాలు ప్రపంచాన్నే ఆశ్చర్యాంబుధిలో తేలియాడేలా చేశాయి. అటు విశాల సాగరంలోనూ.. ఇటు వినీల విహాయసంలోనూ నావికాదళాల విన్యాసాలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయంటే అతిశయోక్తి కాదు. అద్భుతమన్పించే యుద్ధ విమానాల విహంగ విన్యాసాలూ, ఆకాశాన్నే ఆశ్చర్యచకితం చేస్తూ చక్కర్లు కొట్టే హెలికాప్టర్లూ.. ఒకటేమిటి ఎటు చూసినా విభ్రమమే!..విస్మయ చకిత సంభ్రమమే!.. అంబరాన్నంటిన ఈ సాహస సంబ రాన్ని వర్ణించేందుకు మాటలు చాలవు. సుమారు 90 యుద్ధనౌకలు, తీరరక్షణ నౌకలు, వాణిజ్య నౌకలు, జలాంతర్గాములు వేటికవే ప్రత్యేకం. వాటి చాకచక్యం వాటిదే. మరోవైపున చెవులు గింగుర్లెత్తిపోయే రకరకాల యుద్ధ విమానాల హోరుతో విశాఖతీరం దద్దరిల్లి పోయింది. దేశదేశాల నుంచి వచ్చిన ఈ యుద్ధ నౌకలు, విమానాలు తమ ప్రతిభాపాటవాలను చాటుకుంటూ విన్యా సాలు చేయడం ఒక అపురూపమైన అద్భుత మైన ఘట్టమైతే ఈ కార్యక్రమాన్ని ఆద్యంతం అద్భుతంగా నిర్వహించిన తీరు పరమాద్భుతం. భారత ప్రభుత్వానికీ, భారత నావికాదళానికే ఆ కీర్తి దక్కుతుంది. తమ శక్తియుక్తులను చాటుకునేందుకు, ఎదుటివారి సత్తాను తెలుసుకుని మరింతగా నైపుణ్యంలో రాటుదేలేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయి కూడా. గతంలో కూడా ఇలాంటి ప్రదర్శనలు జరిగాయి. అయితే, అప్పటికీ ఇప్పటికీ ఎంతో తేడా వుంది. ఇప్పటి ప్రదర్శనల్లో కేవలం విన్యాసాలకే పరిమితం కాకుండా, సముద్ర తీరప్రాంత రక్షణకు స్నేహసౌహార్ద్రాలతో కలిసికట్టుగా నడవాలనే భావనను అందరిలో కలిగించేందుకు చేసిన కృషి సఫలీకృతమైనదనే చెప్పవచ్చు. తీరప్రాంత రక్షణలో, సముద్రమార్గాల్లో భద్రమైన వాణిజ్య కార్యకలా పాలకు సంబంధించి భారత నావికాదళం అనుసరిస్తున్న వ్యూహాపరిణితిని కూడా ఈ సందర్భంగా ఐఎఫ్ఆర్ ప్రపంచానికి తెలియజెప్పడం భారత్ సమయస్ఫూర్తికి చక్కని నిదర్శనం. అందుకు ముఖ్యంగా ప్రధాని మోడీని, భారత ప్రభుత్వాన్ని అభినందించాల్సిందే. ఇదే సందర్భంలో, మనం ప్రాంతీయ భద్రతను పెంచుకోవాలని, ప్రస్తుతం వున్న వనరులు, సామర్థ్యంతోనే సరిపెట్టుకోకుండా అన్నివిధాలా దక్షతను పెంపొందించుకోవాలని రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేసిన ఉద్బోధ భారత్‌కు అక్షరాలా శిరోధార్యం. అంతేకాదు, స్వదేశీ పరిజ్ఞానంతో యుద్ధనౌకల నిర్మాణ వేగం ఇనుమడిస్తేనే దేశ భద్రత మెరుగు పడుతుందన్న ప్రధాని మోదీ స్ఫూర్తిదీప్తి ఈ కార్యక్రమానికే మకుటాయమానం. శాస్త్ర సాంకేతిక రంగాల్లోనూ, అంతరిక్ష పరిజ్ఞానంలోనూ అన్నిరంగాల్లోనూ అపారమైన ప్రతిభతో ముమ్ముందుకు సాగుతున్న భారత్, నావికాదళ ప్రతిభాపాటవాలు, దీక్షాదక్షతలు కూడా మరింతగా పెరిగి, దేశభద్రత పరంగా మరింత కట్టుదిట్టం కావాల్సిన అవసరం ఎంతో వుందని నొక్కిచెప్పిన నేతల మాటలను స్ఫూర్తిగా తీసుకోవాల్సివుంది. ఒకవైపు, సముద్ర మార్గాల్లో విరివిహారం చేస్తున్న సముద్రపుదొంగల నుంచి, భారీ స్మగ్లింగ్‌లు, దుండగుల నుంచి ఆయా మార్గాలను సురక్షితం చేసుకోవాల్సిన తక్షణావసరాన్ని అందరికీ మరోసారి జ్ఞాపకం చేసినట్లయింది. మరోవైపు, సముద్రమార్గాల ద్వారా దొంగచాటుగా ప్రవేశిస్తున్న ఉగ్రవాద విషసర్పాలను కనిపెట్టి వాటిని ఎప్పటికప్పుడు నిరోధించాల్సిన తక్షణ కర్తవ్యాన్ని కూడా గుర్తుచేసి, ఆ దిశగా అందరినీ కర్తవ్యోన్ముఖులను చేసేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేసినట్లయింది. అన్నిదేశాలవారూ ఒకరికొకరు మైత్రీభావంతో ఎప్పటి కప్పుడు సమాచారం అందించుకోవడం ద్వారా ఉగ్రవాదులను వారి దొష్ట్యాలను అరికట్టేందుకు వీలవుతుందనే విషయాన్ని తేటతెల్లం చేసినట్ల యింది. తుఫాన్‌లు సునామీల వంటి విపత్తుల్లోనూ ఒకరికొకరు స్నేహపూరితంగా ఇచ్చిపుచ్చుకునే సమాచార వ్యవస్థల వల్లనే ఇక్కట్లనుంచి బయటపడ గలమని కూడా స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, వివిధదేశాల మధ్య సంబంధాలు మరింతగా పెంపొం దాలని, ప్రమాదకరమైన ఇలాంటి సమస్యలన్నిటినీ అధిగమించడానికి అందరం కలిసిమెలిసి వుండడ మొక్కటే సరైన మార్గమనే పరమసత్యాన్ని చాటి చెప్పినట్లయింది.

అలుపన్నది లేకుండా పడిలేచే కడలి తరంగాలతో స్ఫూర్తినిస్తూ..అందరినీ నయనానందకరం చేసేవి సముద్రాలే. ఏనాటికీ తరిగిపోని అపార జలసంపదనంతా తరతరాలుగా, యుగయుగాలుగా గంపలకెత్తి మానవాళికి అందిస్తూనే వుండేవి ఈ అంతులేని జలనిధులే. దేశదేశాల సముద్రయానానికీ, రవాణాకు, తద్వారా ఆయా దేశాల ప్రజల ఆర్థిక పరిపుష్టికీ సిరులదారులు పరిచేది ఈ మహాసాగరాలే. ప్రపంచంతో ఒకరికొకరికి సంబంధ బాంధవ్యాలను కలిపింది కూడా ఈ జలధులే. మానవాళికిలా సకల ప్రయోజ నాలనూ సమకూర్చే ఈ కడలీమాతల్లులను కాలుష్యాల బారిన పడకుండా, జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత కూడా అందరిపై వుంది. ఇలాంటి పవిత్రమైన కర్తవ్యాలను గుర్తుచేసి ఐఎఫ్ఆర్ కార్యక్రమం సార్థకమైంది. కాగా, హుద్‌హుద్ తుఫాన్ గాయాల నుంచి ఇటీవలే కోలుకున్న విశాఖ..మళ్ళీ ఇంతలోనే ఇంతటి ఘనమైన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం విశాఖకే కాదు, మన రాష్ట్రానికీ.. దేశానికే ఎంతో గర్వకారణం. ఏదేమైనా.. ఈ కార్యక్రమం చరిత్రాత్మకమే!



## మన ఫ్లీట్... సూపర్‌హిట్

విశాఖలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ నౌకాదళ ప్రదర్శన ఆద్యంతం అద్భుతమైనది. దేశ దేశాల నుంచి వచ్చిన యుద్ధ నౌకలు, విమా నాలు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించడం ఒక అపురూప ఘట్టం. భారత నావికాదళం చరిత్రలోనే ఇది చరిత్రాత్మకం. భారతప్రభుత్వం ఈ కార్యక్రమ నిర్వహణను సాహసప్రదర్శనలకే పరిమితంచేయక, సకల మానవాళికే ప్రయోజనకరంగా తీర్చిదిద్దడం అభినందనీయం. ఇంతఘనంగా ఈ కార్యక్రమం జరగడం విశాఖకే కాదు, దేశానికే గర్వకారణం.

# శాస్త్రీయ ఫలాలు అందరికీ అందాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శేషగిరిరావు

మూఢ నమ్మ కాలు, ఛాందస భావాలు సమాజ పురోగమనాన్ని అడ్డు కుంటాయని సతీష్ ధావన్ స్పేస్ సెం టర్(ఇస్రో) శాస్త్ర, సాంకేతిక సలహాదారుడు శేషగిరిరావు పేర్కొన్నారు. ఆదివారం జనవిజ్ఞానవేదిక, ప్రజా సైన్స్ వేదిక జిల్లా మహాసభలు నెల్లూరు మద్రాసుబస్టాండ్ ప్రక్కనున్న డాక్టర్ విజయకుమార్ రెడ్డి మెమోరియల్ ఆసుపత్రిలో జరిగాయి. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ సైన్స్ ఫలాలు అందరికీ అందితే దేశంలో ఆకలి బాధలు ఉండవన్నారు. అనంతరం విశ్వం పుట్టుక, గ్రహాలు, రాశులు, నక్షత్రాలు, వాటి గమనం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య సబ్ కమిటి కన్వీనర్ డాక్టర్ ముప్పా రామారావు మాట్లాడుతూ పాఠశాలలో ప్రాథమిక స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని విద్యార్థులకు నేర్పితే వారు పెద్దయ్యాక మూఢ నమ్మకాల జోలికి వెళ్లరని చెప్పారు. అనంతరం ప్రకృతి నేస్తం... సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసైన్స్ వేదిక సీనియర్ సభ్యులు సుధాకర్‌రెడ్డి, జేవివి రాష్ట్ర నాయకులు మాల్యాద్రి, నూనె నారాయణ, వరికుంటపాడు శ్రీనివాసులు, గాలి శ్రీనివాసులు, నెల్లూరు ఆసుపత్రి సూపరింటెండెంట్ జయకుమార్, చక్రపాణి, శేషారెడ్డి పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్‌కు

# కొత్త కార్యవర్గం

నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసి యేషన్‌కు ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా సుబ్బరామిరెడ్డి, కార్యదర్శిగా సుబ్బారావు ఎన్నికయ్యారు. కోశాధికారిగా శ్యామ్‌సన్ అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా లక్ష్మణ రాజు, జాలీవాకర్‌గా రామ్మోహన్‌రావు ఎన్నికయ్యారు. వేదాయపాళెంలోని టికె ఎన్నార్ కళ్యాణమండపంలో ఈ ఎన్నికలు జరగ్గా, నూతన కమిటీవారిని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సిహెచ్ సీతా రామయ్య ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేయించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 203 డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్యామల శ్రీనివాసులురెడ్డి, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థా పకుడు మైథిలి మనోహర్‌రెడ్డితో పాటు, దేవరాల సుబ్రహ్మణ్యం, ఎంవి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# సుందరకాండ పారాయణం



నెల్లూరు నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేటలో వున్న శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో ఈ నెల 7న ఎంతో భక్తి శ్రద్ధలతో సుందరకాండను పారాయణం చేశారు. ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని ఆ భగవంతుడిని కోరుకుంటూ నిర్వ హించిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. విశాఖపట్నంలోని శ్రీరామ పాదుకా సంస్థ ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది. సుందరకాండ పారాయణంతో పాటు, 'శ్రీరామ' లిఖిత జపం కూడా జరిగింది. ఈ సందర్భంగా శ్రీ సీతారామ పాదుకా సంస్థ ప్రతినిధి పీసపాటి శేషాచార్యులు మాట్లాడుతూ, పెద్దజీయర్‌స్వామి దేశవ్యాప్తంగా 108 శ్రీరామ క్రతు స్థంభాలను నెలకొల్పారన్నారు. వీటిలో నెల్లూరులో ఏర్పాటు చేసిన శ్రీరామ క్రతుస్థంభం 104వదని తెలిపారు. శ్రీరామ నామ జపం ఎంతో పుణ్యప్రదమని భక్తులకు వివరించారు. స్థానిక ప్రముఖులు రామానుజాచార్యులు, రాఘవాచార్యులు, సంపత్‌కుమార్, శిరీష, కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.




# కొర్రి కాల్చి వాత పెట్టారు

రెండుకళ్ళ సిద్ధాంతంతో చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేశారు. రెండుకళ్ళు, రెండు చెవులంటూ ఆంధ్రప్రదేశ్‌ను అటు ఇటు కాకుండా చేశారు. ఆయన రెండు కళ్ళ సిద్ధాంతం మూలంగా ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన పెట్టుబడులు ఆగిపోయాయి. హైదరాబాద్ అభివృద్ధి నా పుణ్యమేనని డబ్బా కొట్టు కుంటున్న చంద్రబాబుకు సరిగ్గా బుద్ధి చెప్పారు గ్రేటర్ ఓటర్లు. హైదరా బాద్‌లో ఆయన స్థానమేంటో చెప్పారు. చంద్రబాబు ఇకనన్నా హైదరాబాద్ పిచ్చిని వదులుకుని ఆంధ్రప్రదేశ్ గురించి ఆలోచించాలి. **- తోట సుధాకర్, నెల్లూరు.**

# ఆస్తులు జప్తు చేయండి

ఉద్యమాలు, ఆందోళనలలో ఎటువంటి ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించినా బాధ్యుల ఆస్తులను ముందు జప్తు చేసే విధంగా చట్టాలు తేవాలి. ఆస్తులను తగల బెట్టినప్పుడు వీటి భారం ప్రజలపై మోపుతున్నారు. కొందరు వెధవలు చేసే తప్పులకు ప్రజలంతా ఎందుకు బాధ్యత వహించాలి? బస్సులు, రైళ్లు, ప్రభుత్వ వాహనాలను తగులబెట్టినప్పుడు, వారిని గుర్తించి కఠినంగా శిక్షించడమే కాకుండా నష్టపరిహారాన్ని కూడా వారి నుండే వసూలు చేయండి. **- మర్రి సుశీల, హైదరాబాద్.**

# బి.సిల్లో ఎలా చేరుస్తారు?

కాపులను బీసీల్లో చేరిస్తే బలహీనవర్గాలకు అన్యాయం చేసినట్లే! ఇప్పటికే కాపులు చాలా మంది నకిలీ బిసి సర్టిఫికేట్లతో అర్హులైన బలహీనవర్గాల వారికి రావాల్సిన రిజర్వేషన్లను అనుభవిస్తున్నారు. క్షత్రియులు సైతం దొంగ బి.సి సర్టిఫికేట్లు కలిగి వున్నారు. రేపు రెడ్లు, వైశ్యులు, బ్రాహ్మణులు కూడా తమని బి.సిల్లో చేర్చాలని ఉద్యమాలు చేస్తారు. చేసేస్తారా? బి.సిలకు అన్యాయం చేస్తారా? కాపులను బిసిల్లో చేరిస్తే బి.సిలంతా ఉద్యమబాట పడతారు. **- పి.సుబ్బయ్య, నెల్లూరు.**

# ఇసుక ధరలను తగ్గించండి

మధ్య తరగతి ప్రజలు సొంత ఇళ్ళు కట్టుకునే పరిస్థితులు లేవు. ఒకప్పుడు ఇసుక ధర అందరికీ అందుబాటులో వుండేది. ఇప్పుడు సామాన్యుడు ఒక ట్రాక్టర్ ఇసుకను కొనాలన్నా కష్టమే అవుతుంది. ప్రభుత్వ విధానాలు ఇసుక కాంట్రాక్టర్లకే అనుకూలంగా ఉంటున్నాయి. పేదవారికి ఇసుకను సులీసుగా ఇచ్చేలా చూడండి. **- మలిశెట్టి రత్నాకర్, నెల్లూరు.**




భారతదేశంలో కులమతాలకతీతంగా ప్రజలు కలిసి మెలిసి జీవిస్తుంటారు. నెల్లూరులో మాత్రం అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలసి ఉండడమే కాదు ప్రజలతో కుక్కలు, పందులు, కోతులు, దోమలు వంటివి కూడా కలిసి మెలసి జీవిస్తుంటాయి. ఒకరకంగా చెప్పాలంటే ఇక్కడ మనుషుల కంటే కూడా ఇవి హాయిగా బ్రతుకుతున్నాయనుకోవచ్చు. ఎందుకంటే వాటికి మన కార్పొరేషన్ వాళ్లు ఎక్కడా ఆహారం కొరత రానీయడం లేదు.



# ముష్టిపాలిటి

నెల్లూరు కార్పొరేషన్ గతంలో ముదనష్టంగా ఉండేది. ఇప్పుడు ముష్టిముదనష్టంగా తయారవుతోంది. నెల్లూరు కార్పొరేషన్‌కు పాలకులు అవినీతి సంపాదనకు కేంద్రంగా చూస్తున్నారేగాని దానిని ఓ పరిపాలనా కేంద్రంగా, నగరాభివృద్ధికి వేదికగా చూడడం లేదు. పాలకులు మారుతున్నారు గాని నెల్లూరు తల రాత మాత్రం మారడం లేదు. అప్పుడెప్పుడో ఏ.సి సుబ్బారెడ్డి, టి.రమేష్‌రెడ్డిల హయాంలో నెల్లూరులో అభివృద్ధి పనులు చూశారు. వారి తర్వాత అభివృద్ధి కంటే కూడా అవినీతినే ఎక్కువుగా చూస్తున్నారు. ఆనం వివేకానందరెడ్డి నుండి అనూరాధ, పులిమి శైలజ, భానుశ్రీ, నేటి అబ్దుల్ అజీజ్ దాకా నెల్లూరు కార్పొరేషన్ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఒకరితర్వాత ఒకరి కాలంలో నగరంలో పరిస్థితులు దిగజారాయే తప్ప మెరుగుపడింది లేదు. కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ పనులను వాటాలేసుకుని పంచుకోవడం, అక్రమ కన్‌స్ట్రక్షన్‌ల నుండి అవినీతి కలెక్షన్‌లు దండుకోవడం, కౌన్సిల్ సమావేశాలలో మాత్రం మేం ప్రజల కోసం పోరాడుతున్నామని చెప్పుకోవడానికి గొడవలు పెట్టుకోవడం తప్ప నెల్లూరు అభివృద్ధికి నాటి పాలకులు గాని నేటి పాలకులు గాని చేసిందేమీ లేదు. చేస్తున్నది కూడా ఏమీ లేదు. ప్రజలను పందులు, కుక్కలు పీక్కుతింటుంటే పాలకులు మాత్రం అవినీతి సొమ్మును తెగ మేస్తూ, ప్రజల అవస్థలు మాత్రం విస్మరిస్తున్నారు. నెల్లూరులోని ప్రాంతాలలో బలిసిన పందులు మనుషుల కంటే ఎక్కువయ్యాయి. పసిబిడ్డలపై పందుల దాడులు జరుగుతున్నాయి. కొన్ని ఏరియాలను చూస్తే మనుషులు కాకుండా కేవలం ఇక్కడ పందులు మాత్రమే ఉంటాయేమోననిపిస్తుంది. ఇక కుక్కలు, కోతులు సంగతైతే సరేసరి. గుంపులు గుంపులుగా ఇవి వీధుల్లో తిరుగుతూ జనానికి దడపుట్టిస్తున్నాయి. కుక్క కరిచిందంటే రేబిస్ వ్యాక్సిన్‌కు కూడా దిక్కులేదు. ఏ సందులో ఏ కుక్క కరుస్తుందో చెప్పలేని పరిస్థితి. ఆయా ప్రాంతాలలో చెత్తకుప్పలు కొండ లను తలపిస్తుంటాయి. పందులన్నీ వాటివద్దే ముగుతుంటాయి. ఇక నగరంలో దోమలది ప్రత్యేకశైలి. ఇక్కడున్న హైబ్రీడ్ బ్రాండ్ దోమలు దేశంలో మరెక్కడా ఉండవేమో! ఉంటే అమేజాన్ అడవుల్లో ఉండొచ్చు. ఇవన్నీ కూడా జనాన్ని చంపుకు తింటున్నాయి. కుక్కలు, పందులను, కోతులను పట్టుకుని జనావాసాలకు దూరంగా పంపే ప్రయత్నమే చేయడం లేదు. దోమల నిర్మూలనకు కనీస చర్యలు లేవు. దండుకోవడం, పిండుకోవడం పాలకుల ప్రథమ కర్తవ్యంగా మారడంతో నెల్లూరు నగరపాలక సంస్థ పెద్ద అవస్థగా మారింది.


• గ్రూపుల సందడి

# 'దేశం'లో ఆనం అలజడి

ఆనం కుటుంబసభ్యులు తెలుగుదేశంలో చేరాక ఇది కూడా కాంగ్రెస్‌పార్టీలాగే అయ్యింది. ఈ విధంగా అవుతుందని కూడా ముందుగానే ఊహించిందే! ఆనం సోదరుల వల్ల మొట్టమొదటి ఎఫెక్ట్ మేయర్ అబ్దుల్ అజీజ్‌కే ఉండబోతుందని 'లాయర్' ముందే చెప్పింది. ఇప్పుడు అట్లాగే జరుగుతోంది. ఇప్పటికిప్పుడు ఆనం సోదరుల వల్ల మిగతా తెలుగుదేశం నాయకులకొచ్చిన ఇబ్బందేమీ లేదు. ఎవరికీ మంత్రి పదవులొస్తాయని, వాటికి ఆనమోళ్లు అడ్డు తగులుతారనే భయం లేదు. టిక్కెట్లు రాకుంటే బ్రేక్ వేస్తారనడానికి ఇప్పట్లో ఎన్నికలు లేవు. కాబట్టి మిగతా వారికి ఇబ్బంది లేదు. మరి అజీజ్‌తో పేచీ ఎందుకంటే... అతను మేయర్ కాబట్టి! ఆనం వారి టార్గెట్ నెల్లూరు నగరపాలక సంస్థ కాబట్టి!

నెల్లూరు మున్సిపాల్టీ అయినా, కార్పొరేషన్ అయినా దాదాపు 20ఏళ్ల పాటు ఆనం వాళ్ల పెత్తనమే ఇక్కడ నడిచింది. కేవలం ఈ ఒకటిన్నర ఏడాది మాత్రమే గ్యాప్ వచ్చింది. నెల్లూరు నగరం మీద పట్టుండాలంటే నెల్లూరు కార్పొరేషన్‌పై ఆధిపత్యం ఉండాలి. తెలుగుదేశంలో చేరీ చేరగానే ఆనం వాళ్ళు ఆ ప్రయత్నమే మొదలుపెట్టారు. మేయర్ అబ్దుల్ అజీజ్ కుర్చీ క్రింద మంట పెట్టారు. వచ్చీ రావడంతోనే అజీజ్‌పై అవినీతి ఆరోపణలు ఎక్కుపెట్టారు. తండ్రిని మించిన తనయుడనిపించుకుంటున్న కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి కాంగ్రెస్‌లో సింగిల్‌గా వున్నప్పుడే అజీజ్‌ను ఆరోపణలతో ఆడుకున్నాడు. ఇప్పుడు అధికారపార్టీలో ఉన్నాడు. ఊరకుంటాడా? ప్రస్తుతం కార్పొరేషన్‌లో చోటు చేసుకున్న కాంట్రాక్ట్ పనులు, టెండర్ల భాగోతంపై అజీజ్‌ను రంగమయూర్ చీల్చి చెండాడుతున్నాడు.

అంతకుముందు లోలోపల మేయర్‌కు కార్పొరేటర్లకు మధ్య అంతర్గత విభేదాలున్నా బయటపడలేదు. ఆనం వాళ్లు చేరాక అవి బయటపడ్డాయి. అధికారపార్టీ కార్పొరేటర్లందరు అజీజ్ వర్గం, ఆనం వర్గంగా చీలిపోయారు. వీరిలోనే కంటికి కనిపించకుండా ఇంకో రెండు, మూడు వర్గాలున్నాయి. నెల్లూరు కార్పొరేషన్‌లో ఆనం వాళ్ల ఎఫెక్ట్ అప్పుడే మొదలైంది. ఇక అజీజ్‌కు నిత్యం తలనొప్పులే!



# అభివృద్ధి పనులను చేపట్టాలి

**- ఎమ్మెల్యే అనిల్**

నెల్లూరు నగరం, మినీబైపాస్‌రోడ్డులో మిలీనియం సబ్‌స్టేషన్ దగ్గర జరుగుతున్న డ్రైనేజీ పునర్నిర్మాణ పనులను నెల్లూరు నగర శాసనసభ్యులు డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ 7వ తేదీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వీలైనంత తొందరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. డ్రైనేజీ వాటర్ అంతా వెలుపలకు వస్తున్నందున బ్లీచింగ్ వేయడం తదితర అవసరమైన పనులను శానిటేషన్ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. కార్పొరేషన్‌లో 18 నెలల నుంచి ఏ ఒక్క చిన్నపని కూడా చేయలేదని, 13వ ఫైనాన్స్ నిధులు 15కోట్ల రూపాయలు వచ్చాయని, ఇంతవరకు టెండర్లు ఎందుకు ఓపన్ చేయలేదని, వెంటనే టెండర్లు ఓపన్‌చేసి త్వరగా పనులు ప్రారంభించాలని కోరారు. అంతర్గత కలహాలను పక్కన పెట్టాలని, ప్రజలకు జవాబుదారీతనంగా వుండాలని అన్నారు. పనులు ఎవరు తీసుకున్నారని కాకుండా టెండర్లు పిలిచి వెంటనే పనులను కాంట్రాక్టర్లకు అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఊటుకూరు మాధవయ్య, గోగుల నాగరాజు, దేవరకొండ అశోక్, నాయకులు వేలూరు మహేష్, కుంచాల శ్రీనివాసులు, కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## » అధికార పార్టీనా? నిబంధనలా??

# అడకత్తెరలో అధికారులు

**బదిలీలు... లేదంటే సెలవులు!**

**అధికారపార్టీ నాయకుల ఆగడాలకు అధికారులు బెంబేలెత్తుతున్నారు. నెల్లూరుజిల్లా పోస్టింగ్ అంటే ఒకప్పుడు అధికారులు ఉరుకులు పరుగులు మీద వచ్చేవాళ్ళు. ఇప్పుడు ఇక్కడకు రావడానికే భయపడుతున్నారు. అధికారపార్టీ నాయకులు అధికారులను అంతగా సతాయిస్తున్నారు.**

తెలుగుదేశం నాయకులు ఎవరి పనులు వాళ్ళు పూర్తి చేసుకోవాలనే తొందరలో నిబంధనలు సైతం ఉల్లంఘించి తమ పనులు చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇటు అధికారపార్టీ నేతల మాట కాదనలేక అటు నిబంధనలు ఉల్లంఘించలేక అధికారులు నలిగిపోతున్నారు. దీంతో కొందరు అధికారులు నామమాత్రపు పోస్టులకు బదిలీ అవుతుంటే ఇంకొందరు మాత్రం లాంగ్‌లీవ్ అంటూ వెళ్లిపోతున్నారు.

తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన ఒక్కటిన్నరేడాదిలోనే అధికారులపై ఒత్తిళ్లు బాగానే పెరిగాయి. కలెక్టర్‌గా శ్రీకాంత్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో జానకిని నియమించారు. అధికారపార్టీ నేత ఆగడాల మూలంగా ఈమె కూడా బదిలీ ప్రయత్నాల్లో వున్నట్లు తెలుస్తోంది. గతంలో జాయింట్‌కలెక్టర్‌గా వున్న రేఖారాణిని జిల్లా మంత్రి బదిలీ చేయించాడు. ప్రస్తుత ఎస్పీ గజరావ్‌భూపాల్‌ను కూడా బదిలీ చేసే అవకాశముంది. ఒక వర్గం వారితో వచ్చిన వివాదాల నేపథ్యంలో ఆ వర్గం ఓట్లను దూరం చేసుకోకుండా ఉండేందుకు తెలుగుదేశం నాయకులు ఎస్పీ బదిలీకి ప్రతిపాదించి ఉన్నారు. ఇక నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌ది అయితే దారుణ పరిస్థితి. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన ఈ కొద్దికాలంలోనే ముగ్గురు కమిషనర్లు మారారు. ఈ ముగ్గురివి రాజకీయ బదిలీలే!

ఇక మండల కేంద్రాలు, డివిజన్ కేంద్రాలలో అయితే ఆయాశాఖల అధికారులపై స్థానిక నేతల వేధింపులు ఎక్కువవుతున్నాయి. ముఖ్యంగా తమ అనుచరులకు, తమ మనుషులకు కాంట్రాక్ట్ పనులు ఇవ్వలేదనో, తాము చెప్పినదాని ప్రకారం అంచనాలు తయారు చేయలేదనో చెప్పి పంచాయితీరాజ్, ఆర్ అండ్ బి శాఖల అధికారులను సతాయిస్తున్నారు. ఈ సతాయింపులను భరించలేక అధికారులు కొందరు సెలవులపై వెళుతున్నారు.


# నెల్లూరు కబుర్లు

## సీఎం, కేంద్రమంత్రుల రాక

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు యం.వెంకయ్యనాయుడు, పియూష్ గోయెల్‌లు ఈ నెల 27న నెల్లూరుజిల్లాకు రానున్నారు. నేలటూరు వద్ద నెలకొల్పిన కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రాలను జాతికి అంకితం చేసే కార్యక్రమంలో వారు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కృష్ణపట్నం సెజ్ పరిధిలో ఇంకొన్ని కార్యక్రమాలలోనూ వాళ్లు పాల్గొనే అవకాశాలున్నాయి. జనవరిలోనే ఈ కార్యక్రమం జరగాల్సి వున్నప్పటికీ అనివార్య కారణాల వల్ల వాయిదా వేశారు.

## నెల్లూరుకు కొత్త కమిషనర్

- బాధ్యతలు తీసుకున్న వెంకటేశ్వర్లు



సాంప్రదాయబద్ధంగా నెల్లూరు నగరపాలక సంస్థకు ఆరు నెలలకే పాత కమిషనర్ పోయి కొత్త కమిషనర్ వచ్చాడు. గుంటూరులో ఆర్‌డిగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు 10వ తేదీ నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. వచ్చీ రావడంతోనే రంగనాథ స్వామి గుడికెళ్లి నాలుగు కాలాలపాటు ఇక్కడ పని చేసేలా దీవించమని ప్రార్థించినట్లున్నాడు కూడా! రాజకీయ కారణాలతో ఈ నెల 3వ తేదీన కమిషనర్‌గా వున్న పివివిఎస్ మూర్తి బదిలీ కావడం తెలిసిందే! మరి ఈ వెంకటేశ్వర్లుని ఎన్ని నెలలు ఉండనిస్తారో చూద్దాం!

## మూర్ఛవ్యాధి పట్ల భయపడాల్సిన పనిలేదు



మూర్ఛ అనేది ఫిట్స్ వరకు ఆగకుండా సమాజంపై చాలా ప్రభావం చూపుతుందని, మూర్ఛ వ్యాధి అంటే భయపడాల్సిన పనిలేదని అపోలో ఆసుపత్రి న్యూరాలజీ హెచ్‌ఓడి డాక్టర్ బిందు మీనన్ అన్నారు. సోమవారం నెల్లూరు చిల్డ్రన్స్ పార్కు సమీపంలోని అపోలో ఆసుపత్రిలో ప్రపంచ మూర్ఛవ్యాధి దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బిందుమీనన్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా డాక్టర్ల పర్యవేక్షణలో మందులు వాడితే మూర్ఛవ్యాధి నయమవుతుందన్నారు. విద్యార్థులు విషయాలను అవగాహన చేసుకుని మూర్ఛవ్యాధి గ్రస్తులకు ధైర్యాన్నివ్వాలని కోరారు. గోమతి, రెయిన్‌బో పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉపన్యాసాలతో అందరిని ఆకట్టుకున్నారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గోమతి పాఠశాల డైరెక్టర్ అనూరాధ, రెయిన్‌బో పాఠశాల ప్రిన్సిపల్ పద్మాసుబ్రహ్మణ్యం, ఆసుపత్రి యూనిట్‌హెడ్ నవీన్‌రెడ్డి, న్యూరోసర్జన్ డాక్టర్ రవి దడ్డాల, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్వేత పాల్గొన్నారు.

### గ్లోబల్ హెల్త్ సిటీ ఆసుపత్రిలో

## తక్కువ ఖర్చుతో వైద్యం

చెన్నైలోని గ్లోబల్ హెల్త్ సిటీ ఆసుపత్రిలో అతి తక్కువ ఖర్చుతో వైద్యసేవలందిస్తున్నట్లు ఆసుపత్రి వైస్‌ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఓపి కన్సల్టేషన్స్ మీద 50శాతం, ఓపి మరియు ఇన్‌పేషంట్ డయాగ్నస్టిక్స్‌పై ఫీజుల్లో 25శాతం, రూం ఛార్జీలలో 25శాతం, సర్జన్ల ఫీజులలో 25శాతం తగ్గించామని, ఈ అవకాశం ఫిబ్రవరి 23వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకున్న వారు చిరునామా ధృవీకరణపత్రాలతో రావాలని, నెల్లూరు నుండి చెన్నైలోని గ్లోబల్ హెల్త్‌సిటీకి ఎప్పుడూ ఉచిత అంబులెన్స్ సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు.

అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు, మరియు క్యాన్సర్ చికిత్సా విధానంలో నూతన వైద్య ఒరవడిని అనుసరిస్తున్నామని, అత్యాధునిక రేడియో థెరపి మిషన్ ద్వారా తక్కువ రోజుల్లోనే పేషంట్ సాధారణ జీవితం పొందేలా వైద్యం అందిస్తున్న ఏకైక వైద్య సంస్థ గ్లోబల్ హెల్త్ సిటీయేనని ఆయన వెల్లడించారు.

## వేలానికి డిపిఆర్‌ఓ బండి



ఆ బండి ఎంతోమంది అధికారులను, విలేకరులను మోసింది. ఎంతోమంది మంత్రులను, ముఖ్యమంత్రులను చూసింది. ఎన్నో వేల అధికారిక కార్యక్రమాలకు హాజరైంది. ప్రస్తుతకాలంలో ఒక సీనియర్ అధికారికి ఎంత సర్వీసుందో ప్రభుత్వ సేవల్లో దానికి అంతే సీనియార్టీ వుంది. అదే జిల్లా పౌరసంబంధశాఖాధికారి వాహనం. 1991 మోడల్‌కు చెంది ఏపి26టి2376 నెంబర్‌గల టెంపోట్రాక్స్ వాహనాన్ని ఇప్పుడు వేలానికి పెట్టారు. ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3.30గంటలకు డిపిఆర్‌ఓ కార్యాలయం వద్ద వేలం వేస్తున్నారు. దీనికి కనిష్ట ధరగా 16వేల రూపాయలు నిర్ణయించడం జరిగిందని, వేలంలో పాల్గొనే వాళ్లు కనిష్ట ధరలు 4వ వంతు 4వేల రూపాయలు డిడి రూపంలో డిపాజిట్‌ను ముందుగానే ఉపసంచాలకులు, సమాచార పౌరసంబంధాల శాఖ పేరు మీద తీయాలని సమాచారపౌరసంబంధాల శాఖ ఉపసంచాలకులు షేక్‌లాల్‌జాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ ఉదయం 11గంటలలోపు కార్యాలయంలో డిడి ఇచ్చి సాయంత్రం జరిగే వేం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ బండి విలువను డబ్బుతో కొలవలేము. ఇదో జ్ఞాపకం. ఈ జ్ఞాపకాన్ని ఎవరు సొంతం చేసుకుంటారో...?

## త్వరలో పారామెడికల్ శిక్షణ



రాష్ట్రంలో కొన్ని అనివార్య కారణాలవల్ల ఆగిన పారామెడికల్ శిక్షణా తరగతులను తిరిగి ప్రారంభిస్తామని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. శస్త్ర చికిత్స చేయించుకుని ఇంట్లో వున్న మంత్రిని పరామర్శించడానికి గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు వెళ్లగా మంత్రి ఈ భరోసా ఇచ్చారు. మంత్రిని పరామర్శించడానికి వెళ్లిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు గణపతిరావు, ప్రధానకార్యదర్శి యం.డి.సలీం, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రవిచంద్ర, కోశాధికారి టి.రాధాకృష్ణ, నెల్లూరుజిల్లా ప్రధాన కార్యదర్శి పి.రవీంద్రబాబులు వున్నారు.

## 33కె.వి.లైన్‌ను మార్చండి

ఆనం రంగమయూర్



నెల్లూరు నగరం 12వ డివిజన్ పరిధిలోని చింతారెడ్డిపాలెం, ముస్లింవీధిలో నివాస గృహాల మీదుగా వెళుతున్న 33 కె.వి. లైన్‌ను మార్చాలని కోరుతూ ఆ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి ఏపి ట్రాన్స్‌కో ఎస్ఇకి వినతిపత్రం అందించారు. ఈ వీధిలో 50కుటుంబాల దాకా వున్నాయి. ఇంటిపైకి ఎక్కితే వైర్లు తగిలేంత కిందగా లైన్ పోతోంది. ఇటీవలే గాలిపటం కోసం మిద్దెమీదకెక్కిన బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఇక్కడి ప్రజలంతా ఈ లైన్ వల్ల భయాందోళనలకు గురవుతున్నారు. కాబట్టి ఈ లైన్‌ను వెంటనే మార్పించాలని మయూర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానికులు ఖలీల్, ఇబ్రహీం, షాహిద్, మస్తాన్ బాషా, అళహరి విజయ, రాధాకృష్ణారెడ్డి, దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 18న ఆర్టీసీ యూనియన్ల ఎన్నికలు

ఏపిఎస్ ఆర్టీసీ యూనియన్ల గుర్తింపు ఎన్నికలు ఈ నెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్లు కార్మికశాఖ ఉపకమిషనర్ ఎస్.వై.శ్రీనివాస్ తెలిపారు. ఈ గుర్తింపు ఎన్నికల్లో 8సంఘాలు పోటీ చేస్తున్నాయని, సుమారు 4800మంది ఓటు హక్కు కలిగి వున్నారని తెలిపారు. నెల్లూరుజిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ డిపోలలో 13బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఓటింగ్ జరుగుతుందన్నారు. ప్రతి ఓటరు రెండు ఓట్లు వేయాల్సి ఉంటుందని, ఒకటి రాష్ట్ర స్థాయిలో, మరొకటి డివిజన్‌ల వారీగా గుర్తింపు పొందేందుకని తెలిపారు. ఈ సమావేశంలో డిపో మేనేజర్లు, యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

### జాతీయ కవిసమ్మేళనానికి

## కిరణశ్రీ



నెల్లూరుకు చెందిన సాహితీవేత్త, ప్రభుత్వ పాఠ్యగ్రంథ రచయిత, ఏపి రాష్ట్ర అధికార తెలుగు అనువాదకుడు విద్వాన్ కిరణశ్రీకి జాతీయ కవి సమ్మేళనానికి ఆహ్వానం అందింది. ఈ నెల 27 నుండి 29వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్‌నగరంలో నిర్వహించే జాతీయ కవిసమ్మేళనంలో బాలసాహిత్యంపై పత్రం సమర్పించాలని ఆహ్వానించారు.

### లైబ్రరీలలో

## అంబేద్కర్ రచనలు



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పుస్తకాలను, రచనలను రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయ సంస్థలలో ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ దళిత విద్యార్థిసేన జిల్లా అధ్యక్షుడు అరవ పూర్ణప్రకాష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు. అయితే నెల్లూరు, గూడూరు, కావలి, ఆత్మకూరు, సూళ్లూరుపేటలలో వున్న అంబేద్కర్ భవన్‌ల మరమ్మత్తుల కోసం మంజూరు చేసిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈమేరకు జేసీకి వినతిపత్రం అందజేశారు.

## వైశ్యులకు కార్పొరేషన్ కావాలి

అగ్రవర్ణంగా పిలువబడుతున్న ఆర్య వైశ్యులలోనూ తిండికి టికానా లేని పేద ఉన్నారని, అలాంటి పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఏపి ఆర్య వైశ్య మహాసభ అసోసియేట్ జనరల్ సెక్రటరీ తిరివీధి ప్రకాశరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 13జిల్లాల్లో వైశ్యులు దండిగా వున్నారు. పలు నియోజకవర్గాలలో గెలుపోటములను వైశ్యులే శాసిస్తారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక బ్రాహ్మణులకు, కాపులకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేశారు. కాని వైశ్యులను మాత్రం చిన్నచూపు చూస్తున్నారని, సేవా కార్యక్రమాలతో తమవంతు సేవలందిస్తున్న వైశ్యులకు కూడా ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్య విద్యార్థులకు ఐబిసి సర్టిఫికెట్లు అందించి, స్కాలర్‌షిప్‌లు వచ్చేలా చూడాలని ఆయన కోరారు.

# అక్రమంగా కట్టుకోండి.. ఆమ్యామ్యా ఇచ్చుకోండి

**దేశంలో ప్రజలే నిబంధనలు పాటించి వెళ్లారనుకుందాం... అక్రమాలకు, అవినీతికి తావు ఎక్కడుంటుంది. నిబంధనల ప్రకారం పాస్‌బుక్‌కు దరఖాస్తు చేసాం, అది ఇచ్చే గడువు దాకా వేచి చూడాలి. గడువు తీరేలోపలే మనం పాస్‌బుక్‌ను తీసుకోవాలని చెప్పి రెవెన్యూ అధికారులకు లంచాలిస్తాం. డ్రైవింగ్ లైసెన్స్, సీ బుక్, హెల్మెట్ లేకుండా బండి నడుపుతూ పోలీసు పట్టుకున్నప్పుడు లంచమిస్తాం. అదే నిబంధనల ప్రకారం పోతే మనల్ని అడిగేదెవరు? లంచాలు తమ స్వార్థం కోసం అధికారులకు ప్రజలు అలవాటు చేసినవే! ఈరోజు ఆ అలవాటును మానుకోమంటే వాళ్లెలా మానుకుంటారు.**

ప్రజలు నిబంధనలను ఉల్లంఘిస్తే అధికారులకైనా, అవినీతి పాలకులకైనా లంచాలొస్తాయి. ప్రజలు సక్రమంగా పని చేసుకుంటూ పోతే వీళ్లకేం మిగులుతుంది. సమాజంలో భూ తగాదాలు, ఆస్థి వివాదాలు, పాస్‌బుక్‌లు, అడంగళ్లు వంటి పనులుంటేనే రెవెన్యూ వాళ్లకు డబ్బులు. అలాగే దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లు, రేప్‌లు, హత్యలు, పేకాట, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటేనే పోలీసులకు డబ్బులొస్తుంటాయి. ఇలా ప్రతి ప్రభుత్వ శాఖకు కూడా సంబంధిత అక్రమాలుంటుంటాయి.

కార్పొరేషన్ పరిధిలో అయినా, మున్సిపాల్టీల పరిధిలోనైనా అక్రమ నిర్మాణాలు, అక్రమ లేఅవుట్లు, అక్రమ కనెక్షన్లు వంటివి ఉంటేనే అవినీతి కలెక్షన్‌లు ఉంటాయి. అందరూ సక్రమంగా ఉంటే వీళ్లకు కలెక్షన్ ఏముంటుంది. నెల్లూరు నగరపాలక సంస్థ వారి అవినీతి నిర్వాకం గురించి తెలియక నెల్లూరు, కస్తూరిదేవి విద్యాలయం సమీపంలో ఓ మహిళ తనకు చెందిన స్థలంలో కమర్షియల్ భవనం నిర్మాణం చేపట్టింది. నగరంలో చూస్తే 90శాతం భవనాలు ఖచ్చితంగా నిబంధనలు అతిక్రమించి కట్టబడి వుంటాయి. ఈ మహిళ మాత్రం ఒక్క శాతం కూడా నిబంధనలను దాటకుండా, మున్సిపల్ రూల్స్ ప్రకారం ఎంత ఖాళీ స్థలం వదలాలో అంత వదిలిపెట్టి కాంప్లెక్స్ కడుతోంది. నగరంలో నిర్మాణంలో వున్న నూతన భవనాల డేటాను తన దగ్గరపెట్టుకుని కలెక్షన్‌లు చేస్తున్న ఓ పాలకుడు పనిలో పనిగా ఆమెకు కూడా ఫోన్ చేసి తమను కలవాలని, బిల్డింగ్ ప్లాన్ ప్రకారం లేదని, కాబట్టి అధికారిక



పెనాల్టీ చెల్లించాల్సి వుంటుందని పరోక్షంగా చెప్పాడు. దీనిపై మండిపడ్డ ఆ మహిళ తాను నిబంధనల ప్రకారమే కడుతున్నానని, అవసరమైతే కొలతలు కూడా వేయించుకోండని, ఒక్క రూపాయి కూడా లంచం ఇచ్చేది లేదని అతని ముఖాన్నే తెగేసి చెప్పిందని సమాచారం.

ఎవరన్నా పద్ధతిగా రూల్స్ ప్రకారం పోతే మన పాలకులు, అధికారుల నుండి వచ్చే వేధింపులివి. నిబంధనల ప్రకారం భవంతులు కట్టినవారిని నగరపాలక సంస్థ వాళ్లు గుర్తించి, సత్కరించి, సమాజానికి వాళ్లను రోల్‌మోడల్స్‌గా చూపాలి. ఆ పని మాని సక్రమమైన దారిలో నడిచే వాళ్లను కూడా అక్రమబాట పట్టించే విధంగా పాలకుల పోకడలను ఏమనుకోవాలి?

# సింహపురిలో న్యూరోసైన్సెస్

నెల్లూరు రూరల్ మండలం చింతారెడ్డిపాలెంలోని సింహపురి ఆసుపత్రిలో సోమవారం 'సింహపురి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరో సైన్సెస్'ను ప్రారంభించినట్లు ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్, ప్రముఖ న్యూరో సర్జన్, ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరప్రసన్న పేర్కొన్నారు. నెల్లూరులోని ఓ హోటల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరప్రసన్న మాట్లాడుతూ మెదడు, వెన్నెముక తదితర వ్యాధులకు సంబంధించిన ఏడు విభాగాలతో న్యూరోసైన్సెస్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. న్యూరాలజీ, న్యూరో సర్జరీ, న్యూరో ఎమర్జెన్సీ, న్యూరో



ఇంటెన్సివ్ కేర్, న్యూరో సైకియాట్రి, న్యూరో రేడియాలజీ, న్యూరో ఫిజియో, రిహాబిలిటేషన్ విభాగాలు ఇందులో వున్నాయన్నారు. న్యూరాలజిస్ట్ దీక్షాంతి నారాయణ్, డాక్టర్ సుజయ్ సదా ఆసుపత్రి సిఓఓ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య వీరరాఘవస్వామి దేవాలయాభివృద్ధికి కృషి

**- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి**



నెల్లూరు నగరంలో అత్యంత ప్రాచీనమైనదిగా ప్రసిద్ధిగాంచిన 400 సంవత్సరాల చరిత్రగల శ్రీ వేమాలశెట్టి బావి ఆవరణలో వెలసిన వైద్య వీరరాఘవస్వామి దేవాలయాన్ని దేవాదాయ శాఖ, ఏపి టూరిజం శాఖల ద్వారా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. వేమాలశెట్టి బావి త్రైమావాశ్య తిరునాళ్ళ సందర్భంగా ఎమ్మెల్యే సోమవారం దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. శివలింగానికి ఉప్పుతో అభిషేకం చేసి, బావిలో బెల్లం వదిలి మొక్కును తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్‌నగర్‌లో వెలసిన ఈ దేవాలయం అత్యంత ప్రాచీన్యం పొందడంతో రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి భక్తిశ్రద్ధలతో బావిలో బెల్లం వేసి మొక్కును తీర్చుకుంటున్నారన్నారు. ఈ ఆలయాన్ని దర్శించుకుంటే ఆయురారోగ్యాలతో పాటు ఆర్థికంగా రాణిస్తారనే విశ్వాసం భక్తులకుందని అన్నారు. ఇంత చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైన వుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు బత్తిన శోభన్‌రెడ్డి, ప్రవీణ్, లక్ష్మణ్‌రావు, రాజా, మందా బాబు, పి.వి.రాజేష్, ఆనంద్, కుమార్, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ కుటుంబానికి భద్రత చెక్కు



నెల్లూరుజిల్లా దుత్తలూరు పోలీసుస్టేషన్లో కానిస్టేబుల్‌గా పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన మాచర్ల మల్లికార్జున్‌రావు కుటుంబానికి రూ. 2లక్షలు భద్రత చెక్కును సోమవారం అడిషనల్ ఎస్పీ రెడ్డి గంగాధర్ నెల్లూరు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో అందజేశారు. ఏఓ రాజశేఖర్, బీసెక్షన్ సూపరింటెండెంట్ సులోచన, సీనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కడి పనులు అక్కడే గప్‌చిప్...



అనుకోకుండా సంభవించే ప్రమాదాలప్పుడు అధికారులు, నాయకులు ఇచ్చే హామీలు, సమస్య తొలగినప్పుడు గప్‌చిప్ అయిపోవడం మామూలే! ఇటీవల నెల్లూరుజిల్లాలో కురిసిన భారీవర్షాలకు వరదలతో నెల్లూరు నగరం నీట మునిగింది. ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. కొన్ని కాలనీల్లో వరద ఉధృతికి ప్రజలు బయటకు వచ్చే దారి లేక ప్రాణాలు అరచేతిలో పట్టుకుని బిక్కుబిక్కు మంటూ గడిపారు. నెల్లూరు నగరంలోని పలు పంట కాలువలు ఆక్రమణలకు గురి కావడమే ఈ పరిస్థితికి కారణమంటూ అప్పటికప్పుడే కాలువల్లో పూడికలు తీయించి ఆక్రమణల తొలగింపుకు సర్వేలు చేసి రెడ్‌మార్కులు పెట్టి నానా హంగామా చేసిన నాయకులు, అధికారులు వరదలు తగ్గిపోగానే ఎక్కడి పనులు అక్కడే ఆపేశారు. మరలా చెత్తాచెదారాలతో నిండిపోయి కాలువలు యధాస్థితికి చేరాయి. నెల్లూరు మూలాపేటకు పోయేదారిలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి ముందుండే గచ్చుకాలువపై పగులగొట్టిన గోడను ఒకవైపు ఇప్పటివరకు నిర్మించలేదు. మరోవైపు అరరాయి కన్నా పల్చగా కట్టారు. ఏదైనా సైకిల్ ఢీకొన్నా పడిపోయే పరిస్థితి. ఈ దారి నుండి వేలాది వాహనాలు, ఆటోలు, కార్లు జొన్నవాడ, నరసింహకొండ, మూలాపేట, పొదలకూరు రోడ్డుకు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఘోరప్రమాదాలు జరిగే అవకాశం వుంది. మరలా ముప్పు సంభవిస్తే గాని నాయకులు, అధికారులు మేల్కోరేమో!?

# షిరిడికి రైలు



- **బాబా భక్తుల్లో ఆనందం**

నెల్లూరుజిల్లాలో సాయిబాబా భక్తులెక్కువ. దీనికి ఉదాహరణ నగరంలో వున్న సాయిబాబా మందిరాలే! చిన్నవి పెద్దవి కలిపి ఖచ్చితంగా పాతిక దాకా వుంటాయి. తిరుమలకు మాదిరిగానే ఈమధ్య జిల్లా నుండి షిరిడి వెళ్లే భక్తులు కూడా పెరిగారు. అయితే నెల్లూరు నుండి షిరిడికి నేరుగా రైలు వసతి లేదు. రేణిగుంట, విజయవాడ లేదా హైదరాబాద్‌లకు పోయి అక్కడ నుండి వెళ్లాలి. అదీగాక రిజర్వేషన్‌లు దొరకడం కూడా కష్టమే. ఆ సాయినాథుడే కరుణించాడో ఏమో గాని సాయి భక్తుల కల ఫలించింది. నెల్లూరు నుండే నేరుగా షిరిడికి రైలు వేశారు. దక్షిణ మధ్య రైల్వే షిరిడికి కొత్త రైలును ప్రవేశపెట్టింది. నెల్లూరు నుండి వారంలో ఒకరోజు ఈ రైలు ఉంటుంది. ప్రతి శుక్రవారం నెల్లూరులో రాత్రి 9.40గంటలకు బయల్దేరే ఈ రైలు పక్కరోజు మధ్యాహ్నం 12గంటలకు నాగర్‌సోల్ చేరుకుంటుంది. ప్రతి శనివారం రాత్రి 10గంటలకు నాగర్‌సోల్‌లో బయలుదేరి పక్కరోజు రాత్రి 11గంటలకు నెల్లూరు చేరుకుంటుంది. ఈ నెల 12వతేదీ నుండి ఈ రైలు ప్రారంభం కానుంది. షిరిడికి రైలు సౌకర్యం రావడం పట్ల సాయిబాబా భక్తులు ఇది బాబా దయ అంటూ ఆనందపడుతున్నారు.






# ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం

## - చైర్‌పర్సన్ పొనకా దేవసేన



పర్యావరణానికి పెనుముప్పుగా మారుతున్న ప్లాస్టిక్‌ను నిషేధించడం ప్రజల సహకారంతోనే సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. జేవీవీ ఆధ్వర్యాన పట్టణంలో కళాశాల విద్యార్థులతో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు గడియారపు స్థంభం కూడలి వద్ద ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ప్లాస్టిక్ కవర్లు మట్టిలో కలిసేందుకు కొన్ని వేల సంవత్సరాలు పడుతుందన్నారు. ప్రజలు గుడ్డసంచులు, జనపనార సంచులను వినియోగిస్తే మేలని చెప్పారు. ప్లాస్టిక్ భూతాన్ని సమూలంగా అంతమొందించేందుకు అందరూ నడుంబిగించకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని జేవీవీ నాయకుడు వేగూరు రాజేంద్ర పేర్కొన్నారు. విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి ప్రజలను చైతన్యం చేసేందుకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకుడు మనపాటి రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.మునిగిరీష్, ప్రక్కన క్లబ్ అధ్యక్షుడు అశోక్‌చక్రవర్తి మరియు ప్రతినిధులు

# రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్‌గా మునిగిరీష్

రోటరీ క్లబ్‌లో సామాన్య సభ్యుడిగా ఉన్న తనను పెద్దలు వెన్నుతట్టి ప్రోత్సహించడంతోనే జిల్లా గవర్నర్ స్థాయికి ఎదిగానని రొటేరియన్ కొణిదల మునిగిరీష్ అన్నారు. 2018-19 సంవత్సరానికి రోటరీక్లబ్ జిల్లా గవర్నర్‌గా మునిగిరీష్ ఎంపికైనట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు అశోక్ చక్రవర్తి ప్రకటించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మలంవీధిలోగల రోటరీ భవనంలో ఇటీవల ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దల సహకారం మరువలేనిదన్నారు. క్లబ్ తరపున సేవలందించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా మాజీ గవర్నర్లు భరత్‌కుమార్‌రెడ్డి, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, రొటేరియన్లు దశరథరామిరెడ్డి, జానకిరామిరెడ్డి, కార్యదర్శి మునిరాజా, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

## - కనుమూరు హరిచంద్రారెడ్డి



సన్మానం అందుకున్న ఆలయ ధర్మకర్తల మండలి నూతన చైర్మెన్ కె.హరిచంద్రారెడ్డి, సభ్యులు

అందరి సహకారంతో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కనుమూరు హరిచంద్రారెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని రాజావీధిలో వెలిసి వున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కొత్తగా నియమించిన చైర్మెన్‌తో పాటు సభ్యులుగా మారంరెడ్డి దయాకర్‌రెడ్డి, బి.కృష్ణవేణి, ఎన్.సుధాకర్, మనీష్‌కుమార్, బట్టేపాటి బాలయ్య, దేగా నారాయణ, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా డిఎల్ఎన్‌వీడీ వాచస్పతి స్వామిలతో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, ఈవో తాతా శ్రీనివాసరావు ప్రమాణం చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హరిచంద్రారెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రముఖులు, ఆయా మాజీచైర్మెన్ల సమన్వయంతో కోనేరును అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. భక్తులకు కావాల్సిన సౌకర్యాల కల్పనలో చొరవ చూపుతామని అన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులను స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, మాజీచైర్మెన్లు తలమంచి శిద్దారెడ్డి, శ్రీకంఠి రామమోహన్‌రావు, చిల్లీస్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్లంకొండ వెంకటసుబ్బయ్య, కె.మునిగిరీష్ పాల్గొన్నారు.

# భూసమస్యలను పరిష్కరించడంలో విఫలం

## - ఎమ్మెల్యే సునీల్



గూడూరు సబ్‌కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే పాశం

నియోజకవర్గంలో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించడంలో అధికార యంత్రాంగం విఫలమైందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ధ్వజమెత్తారు. గూడూరు పట్టణంలోని రోడ్లు, భవనాల అతిథిగృహంలో సోమవారం ప్రజల వద్ద నుంచి వివిధ సమస్యలపై వినతులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ భూసమస్యలు అధికంగా వున్నా, అధికారులు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా ఉంటున్నాయన్నారు. వాకాడు మండలం కొండాపురం గ్రామంలో అన్యాక్రాంతమైన సీలింగ్ భూములను కబ్జాదారుల చేతుల్లోంచి విడిపించి పేదలకు పంపిణీ చేయాలని కోరారు. గులక, సిలికా, ఇసుక అక్రమరవాణా యధేచ్ఛగా సాగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోందన్నారు. భూదందాలు పెరిగిపోయాయని వివరించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పక్కాగృహాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువును పెంచాలని పేర్కొన్నారు. అనంతరం గూడూరు సబ్ కలెక్టర్ గిరీషాను ఆయన భూసమస్యలపై కలిశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వాటంబేడు శివకుమార్, ఇబ్రాయిల్ కుమార్, వైకాపా నాయకుడు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# సమస్యలపై దృష్టి సారించాలి

## - గూడూరు తహాశీల్దార్ సత్యవతి



గ్రామాల్లో ఉన్న రెవెన్యూ సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గూడూరు తహాశీల్దార్ సత్యవతి తెలిపారు. స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో 6వ తేదీ ఆమె రెవెన్యూ సిబ్బందితో పలు సమస్యలపై సమీక్షించారు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమణలకు గురికాకుండా ఎప్పటికప్పుడు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు వీఆర్‌ఏ పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. భూసర్వేకి సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి పక్కాగా సర్వే చేసి వివాదాలు లేకుండా చేయాలని కోరారు. పెండింగ్‌లో వున్న పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు అందించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సేవలోనే సంతృప్తి

## - డాక్టర్ సిఆర్ రెడ్డి




మాట్లాడుతున్న డాక్టర్ సిఆర్ రెడ్డి, ప్రక్కన జనార్ధనరెడ్డి, సి.రోహిణి తదితరులు

నిరాదరణకు గురైన వారిని అక్కున చేర్చుకొని సేవ చేయడంలోనే సంతృప్తి ఉంటుందని డాక్టర్ సిఆర్‌రెడ్డి అన్నారు. 'మానవసేవయే మాధవసేవ' అన్న సూక్తిని అందరూ అనుసరిస్తే మేలన్నారు. గూడూరులోని శిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం శిరిడీ కల్చరల్ మిషన్, ఆంధ్ర మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదరణ కరవై దుర్భర జీవనం గడుపుతున్న మానసిక వికలాంగులకు డాక్టర్లు సిఆర్‌రెడ్డి, సి.జనార్ధన్‌రెడ్డి, సి.రోహిణిలు ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో వారికి క్షవరాలు చేయించి కొత్త దుస్తులు అందజేసి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధాప్యంలో ఆదరణ కరువైన వారిని గుర్తించి సేవా కార్యక్రమాలు చేసేందుకు మహిళామండలి, కల్చరల్ మిషన్ వారు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తనూజ, గురుమూర్తి, మహిళా మండలి సభ్యులు ఎల్లసిరి లక్ష్మి, ప్రభారెడ్డి, కె.సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 12.2.2016 నుండి
తేది. 18.2.2016 వరకు

ఈ వారం మీన మేష వృషభ మిధున రాశులలో చంద్రుడు, సింహంలో గురు రాహువులు, తులలో కుజుడు, వృశ్చికంలో శని, మకరంలో బుధ శుక్రులు, కుంభంలో రవి కేతువులు సంచరిస్తారు.

## పంచాంగము:

తేది 14 ఆదివారం రథసప్తమి పర్వదినము. తేది 18 గురువారం భీష్మఏకాదశి.

### ముహూర్తములు

- తేది 12 శుక్రవారం సూర్యోదయానికి ముందు గంట 2.24 నుండి 4.30లోగా ధనుర్లగ్నమున వివాహ గృహప్రవేశాలు.
- తేది 18 గురువారం సూర్యోదయానికి ముందు గంట 1.40 నుండి 3.50లోగా ధనుర్లగ్నమున వివాహ గృహప్రవేశాలు.

### మాఘమాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 12 | శుక్ర | చతుర్థి | ప॥ గం.1.20వ॥ |
| తేది. 13 | శని | పంచమి | ఉ॥ గం.11.0వ॥ |
| తేది. 14 | ఆది | షష్ఠి | ఉ॥ గం.8.34వ॥ |
| | | సప్తమి | పూర్తిగ |
| తేది. 15 | సోమ | అష్టమి | రా॥ గం.4.03వ॥ |
| తేది. 16 | మంగళ | నవమి | రా॥ గం.2.11వ॥ |
| తేది. 17 | బుధ | దశమి | రా॥ గం.12.34వ॥ |
| తేది. 18 | గురు | ఏకాదశి | రా॥ గం.11.17వ॥ |

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

సంప్రదింపులు, ఒప్పందాలకు అనుకూల పరిస్థితులుంటాయి. వ్యాపారవర్గాలకు అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. ఆర్థిక లావాదేవీలందు, ఆరోగ్య విషయంలో జాగ్రత్తపడాలి. మాటలలో చేతలలో తొందర వద్దు. ఉద్యోగులు సహచరులతోను, అధికారులతోను జాగ్రత్తగా మెలగండి. శుభకార్య ప్రయత్నాలు అనుకూలించగలవు. బ్యాంకు ఋణాలు లభిస్తాయి.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

స్థిరాస్తుల వ్యవహారాలు పరిష్కారానికి వస్తాయి. వృత్తి వ్యాపారాలు సంతృప్తినివ్వగా ఆదాయం పెరుగుతుంది. తొందరపడి హామీలు ఋణాలు ఇవ్వవద్దు. అవసరానికి మీరే ఋణాలు చేయవచ్చును. కొన్ని ముఖ్యావసరాలు వాయిదా పడతాయి. కోర్టు కేసులందు అనుకూలత, మంచి సేవా సంస్థలో చురుకుగా పాల్గొంటారు. శుభకార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది.

### మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఏదో ఒక రూపంలో ఖర్చులు అధికంగా ఉండినా డబ్బుకు ఇబ్బందులు రావు. వృత్తి పరంగా బాగుంటుంది. వ్యాపారవృద్ధి అవకాశాలు సరిగా ఉండవు. సామాన్య ఆదాయం. సోదరవర్గానికి మేలు జరుగుతుంది. బంధువర్గంతో విభేదాలు రాకుండా చూచుకొనండి. ఉద్యోగులకు ప్రభుత్వ అధికారుల ఆదరణ బాగుంటుంది. అధికారులకు స్థానమార్పులుండగలవు.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

భాగస్వామి అవకాశాలు ఫలిస్తాయి. వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ముఖ్య విషయాలలో కుటుంబసభ్యులు వ్యతిరేకించినా మరల మీకు అనుకూలం కాగలరు. వృత్తి, ఉద్యోగస్థులకు మంచి గుర్తింపు గౌరవాలుంటాయి. అనుకున్న పనులు శ్రమైనా పూర్తి చేస్తారు. ఇంట బయట ఆర్థిక సమస్యల నుండి బయటపడతారు.

### సింహాం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకున్న పనులు జరుపుకొనడానికి బాగా కృషి చేస్తారు. కొత్త ప్రణాళికలతో వ్యాపారవృద్ధి ప్రయత్నాలు జరుగుతాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. బంధువులతో ఆత్మీయులు మిత్రులతో పేచీలు రాకుండా జాగ్రత్తపడండి. ఉద్యోగార్థులకు అవకాశాలుంటాయి. ఆరోగ్యం సరిగా ఉండదు. ఆర్థిక విషయాలలో అంచనాలు ఫలిస్తాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అనుకున్న పనులు చక్కబెట్టుకొనడానికి బాగా ఖర్చు కాగలదు. ప్రభుత్వం నుండి జరగవలసిన పనులు ఆలస్యం కాగలవు. వృత్తివ్యాపారవర్గాలకు ఆదాయం బాగుంటుంది. బంధుత్వాలు స్నేహాలు బలపడతాయి. మాట దూకుడు తగ్గించుకొనాలి. రావలసిన బాకీలు కొంత అందుతాయి. దూరప్రయాణాలు ఉండగలవు. అనవసర ఖర్చులు అదనం.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

స్థిరాస్తుల క్రయవిక్రయ లావాదేవీలు జరుగుతాయి. అనుకున్న పనులను పట్టుదలతో సాధిస్తారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి రాబడి పెరుగుతుంది. కోపం పట్టుదల తగ్గించుకొని సమయానుకూలంగా వ్యవహరించాలి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ప్రయాణాలు తప్పనిసరిగా ఉండవచ్చును. ప్రభుత్వ అనుమతులు బ్యాంకు ఋణాలు పొందుతారు.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వ్యాపారాలలో ఆశించిన ఆదాయం ఉండటం, పెట్టుబడి అవకాశాలు దొరకగలవు. రావలసినవి గాని ఇవ్వవలసిన బాకీలుగాని కొంత తీరుతాయి. అదనపు ఖర్చులు పైనబడినా ప్రయోజనకరం. వాహనాలు నడిపేవారు, యంత్రాలు, కరెంటు పనులు వారు గాయాలు తగలకుండా జాగ్రత్తపడాలి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత తక్కువ. విద్యాప్రగతి బాగుంటుంది.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబ వ్యవహారాలు ఆర్థిక వ్యవహారాలలో ఇబ్బందులుండినా సర్దుబాటు చేసికొనిపోతారు. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. పెండింగ్ వ్యవహారాలు పరిష్కారం కాగలవు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ఉద్యోగప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. ప్రముఖులతో పరిచయాలేర్పడతాయి.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

స్థిరాస్తులపై ఆదాయం, పొదుపు, పెట్టుబడి రంగాలలో అవకాశాలు దొరుకుతాయి. వృత్తి వ్యాపారాలు వేగం అందుకొని ఆదాయం పెరుగుతుంది. శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. బంధుమిత్రులతో సత్సంబంధాలు గట్టిపడటం, సహకారం పొందడం ఉంటుంది. ప్రయాణాలుండి కలిసివస్తాయి.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థిక ఇబ్బందులనెదుర్కొనవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. సమస్యల పరిష్కారానికి ఎంత సమర్థతతో కృషి చేసినా ఫలితం సరిగా ఉండదు. వ్యవహారాలు జాగ్రత్తగా నడపాలి. డబ్బులు, మాట హామీలను ఇవ్వవద్దు. విద్యాప్రగతి బాగుంటుంది. పెట్టుబడులు తొందరపడి పెట్టవద్దు. కోర్టు కేసులు వాయిదా పడవచ్చును. చిన్నచిన్న విషయాలపై ఇతరుల విమర్శనలను ఎదుర్కొనవలసివస్తుంది.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి ఉపాధి పథకాలలో నిలద్రొక్కుకుంటారు. చేపట్టిన పనులు జరగడానికి బాగా ఖర్చు పెరుగుతుంది. వ్యాపారవృద్ధికి మంచి అవకాశాలు దొరకడం, ఆదాయం పెరగడం జరుగుతుంది. ఉద్యోగులు సహచరులతో అధికారులతో జాగ్రత్తగా మెలగండి. పనిభారం పెరుగుతుంది. వ్యాపారులు కాంట్రాక్టర్లపై ప్రభుత్వ దాడులుంటాయి. పెట్టుబడులు షేర్ల విలువలు పెరుగుతాయి.

# చంద్రబాబును ప్రశంసించిన కేటీఆర్

శ్రీను గల్పిక

అది హైదరాబాద్ నగరం. గ్రేటర్ ఎన్నికలకు ఐదురోజుల ముందు సీన్. అమీర్‌పేటలోని ఓ చౌరస్తా. హైటెక్‌రత్న, ఆంధ్రా సీఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాడు. పక్కన రేవంత్ రెడ్డి, బీజేపీ నాయకులు బండారు దత్తాత్రేయ, కిషన్‌రెడ్డిలు కూడా వున్నారు. హైదరాబాద్, అమరావతి నాకు రెండు కళ్ళు... హైదరాబాద్ ఈరోజు ఇలా ఉందంటే దానికి కారణం నేనే. హైటెక్ సిటీ కట్టింది నేనే... గచ్చిబౌలి స్టేడియం నాదే... శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నా పుణ్యమే... రింగ్‌రోడ్డు నేనే వేయించా, ట్యాంక్ బండ్ నేనే కట్టించా... హైదరాబాద్‌కు బిల్‌క్లింటన్‌ను తీసుకొచ్చింది నేనే. బిల్‌గేట్స్‌ను రప్పించింది నేనే.. దేశంలో హైదరాబాద్‌ను నెంబర్ వన్ సిటీ చేసింది నేనే... కాబట్టి మీ ఓట్లు నా పార్టీకే వెయ్యాలి, మేం గెలిచామంటే హైదరాబాద్‌ను వరల్డ్‌లోనే నెంబర్ వన్ సిటీ చేస్తా... అంటూ చంద్రబాబు తన ప్రసంగం ముగించాడు.

చంద్రబాబు ప్రసంగాన్నంతా తెలంగాణ భవన్‌లో కూర్చుని టి-సీఎం కేసీఆర్ చూస్తున్నాడు. అతనికి చిర్రెత్తుకొచ్చింది. పక్కనే వున్న ఈటెల రాజేందర్, జగదీశ్వర్‌రెడ్డి, హరీష్‌రావు, నాయని నర్సింహారెడ్డి, కడియం శ్రీహరిలతో... ఇతనికి మైండ్ దొబ్బినట్లుంది... చంద్రబాబుకు హైదరాబాద్ పిచ్చి ఇంకా వదల్లేదు, ఇంకా ముదిరింది. ఓటు-నోటు కేసును మళ్ళీ తెరకెక్కిస్తేగాని దారికి వచ్చేటట్లు లేడన్నాడు. అంతలో అక్కడకు వచ్చిన కేటీఆర్ అది విని... ఓట్లతో పోయేదానిని ఓటు-నోటు కేసు దాకా ఎందుకు డాడీ అని అడిగాడు. అంటే... అని కేసీఆర్ ప్రశ్నించాడు. గ్రేటర్ ఎన్నికల్లో తెలుగు దేశంకు 'ఓట్లు-సీట్లు' లేకుండా చేస్తే చంద్రబాబు తనంతట తాను హైదరాబాద్ వదిలిపోతాడుగా... ఆ మాత్రం దానికి కేసులు తిరగదోడడం ఎందుకని కేటీఆర్ చెప్పాడు. హైదరాబాద్‌లో ఆంధ్రా సెటిలర్స్ ఎక్కువుగా ఉన్నారు. ముస్లింలంతా ఎంఐఎంకు వేస్తారు. ఆంధ్రులంతా తెలుగుదేశంకు వేస్తారని నా నమ్మకం. సెటిలర్స్ అంతా అటు వేస్తే తెలుగు దేశంకు కనీసం 20సీట్లన్నా వస్తాయి. ఆ మాత్రం సీట్లొచ్చాయంటే చంద్రబాబు ఇక హైదరాబాద్‌ను వదిలి పెట్టిపోడు. తెలంగాణలో తెలుగుదేశంను పెంచుకోవాలని చూస్తాడు. అతను హైదరాబాద్‌లో వుంటే మనకు లేనిపోని తలనొప్పి అని కేసీఆర్ చెప్పాడు. అందుకు కేటీఆర్... మీరేం వర్రీకాకండి డాడీ... ఈ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేసాంరా బాబు అని చంద్రబాబు అనుకునేలా చేస్తాను, నన్ను నమ్మండి అని చెప్పడంతో కేసీఆర్ కూల్ అయ్యాడు.

★★★★★

విశాఖపట్నంలో సాగర తీరం. అంతర్జాతీయ యుద్ధనౌకల ప్రదర్శన అట్టహాసంగా జరుగుతోంది. భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులు వివిధ దేశాల యుద్ధనౌకల విన్యాసాలను, గగనతలంలో యుద్ధవిమానాలు చేస్తున్న సాహసాలను కళ్ళప్పగించి చూస్తున్నారు. అప్పుడే చంద్రబాబు సెల్‌ఫోన్ మోగింది. అది కొడుకు నారా లోకేష్ నుండి... అప్పుడే గ్రేటర్ ఎన్నికల కౌంటింగ్ జరుగుతుండడంతో బహుశా దాని గురించే చేసివుంటాడని చంద్రబాబు ఫోన్ ఎత్తాడు. అవతల నుండి లోకేష్... నాన్న, టీవీలో గ్రేటర్ ఫలితాలొస్తున్నాయి. మన పార్టీ నెంబర్ వన్ ప్లేస్‌లో ఉందన్నాడు. వెంటనే చంద్రబాబు రెండోమాట వినకుండా ఆనందంతో... తొలిప్రేమ సినిమాలో పవన్ కల్యాణ్ మాదిరిగా కొంచెం పక్కకు పోయి డ్యాన్స్ చేశాడు. తర్వాత అక్కడే వున్న ఓ స్వీట్స్‌బాక్స్ తీసుకుని ప్రణబ్ ముఖర్జీకి, మోడీ, మనోహర్ పారికర్‌కు తినిపించాడు. మోడీ వుండి... ఏంటి విషయం అని అడిగాడు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో మా పార్టీ నెంబర్ వన్ పొజిషన్‌లో ఉందని ఆనందంగా చెప్పాడు. అప్పుడు మోడీ.. మరి మా పార్టీ పొజిషన్ అని అడిగాడు. వెంటనే చంద్రబాబు మళ్ళీ లోకేష్‌కు ఫోన్ చేసి... మిగతా పార్టీల పొజిషన్లేంటి? అని అడిగాడు. అప్పుడు లోకేష్... నెంబర్ టులో కాంగ్రెస్ వుంది డాడీ, మనకు గట్టిపోటీ ఇచ్చింది. ఇక మన మిత్రపక్షం బీజేపీకి మనకు దగ్గరగా నాలుగోర్యాంకు వచ్చింది. ఎంఐఎంకైతే 44వ ర్యాంకు వచ్చింది... కామెడీ ఏంటంటే మనతో పెట్టుకున్న కేసీఆర్ నామరూపాలు లేకుండా పోయాడు. ఆయన పార్టీ టీఆర్‌ఎస్‌కు 99వ ర్యాంకు వచ్చిందన్నాడు. లోకేష్ నోట ఈ ర్యాంకుల మాట రావడంతో చంద్రబాబు గుండె ఒక్కసారి గతుక్కుమంది. ఎన్నికల ఫలితాలలో 44వ ర్యాంకు, 99వ ర్యాంకు ఏమిటి? ఎన్నికల్లో పోటీ చేసిన పార్టీలు ఐదారుకుమించి లేవు. వీడు రిజల్ట్స్ ఏ విధంగా చూస్తున్నాడని అనుమానమొచ్చి... మన పార్టీ నెంబర్-1 స్థానంలో వుందని, టీఆర్‌ఎస్ 99వ స్థానంలో వుందని ఎలా చెబుతున్నావని లోకేష్‌ను అడిగాడు. దాని కతను... టీవీలో టీడీపీకి ఎదురుగా '1' అంకె వుంది... టీఆర్‌ఎస్ ఎదురుగా '99' అంకె వుంది. కాబట్టి మనం నెంబర్ వన్ స్థానంలో వున్నట్లే కదా అని చెప్పాడు. ఆ మాటకు చంద్రబాబు కళ్ళు బైర్లు కమ్మాయి. వీడింకా ఎంసెట్ మూడ్‌లోనే ఉన్నట్లున్నాడు. వచ్చిన సీట్లను ర్యాంకులనుకుంటున్నాడని చంద్రబాబు మనసులోనే దిగాలుపడిపోయాడు.

★★★★★

తెలంగాణ భవన్‌లో గ్రేటర్ విజయోత్సవ సంబరాలు జరుగుతున్నాయి. కార్యకర్తలు స్వీట్లు పంచుకుంటూ, ఔట్లు పేల్చుకుంటూ కేరింతలు కొడుతున్నారు. కేసీఆర్ బృందమంతా ఆ వేడుకల్లో పాల్గొంది. అంతలో అక్కడకు కేటీఆర్ వచ్చాడు. కేసీఆర్ కొడుకును ప్రేమతో ఆలింగనం చేసుకుని... చంద్రబాబు హైదరాబాద్ వదిలేలా చేస్తానన్న మాటను నిలబెట్టుకున్నావు, ఇదెలా సాధ్యమైందని అడిగాడు. దానికి కేటీఆర్... నేను చంద్రబాబు పట్ల పాజిటివ్ ప్రచారంతో వెళ్లాను, సీమాంధ్ర సెటిలర్స్‌ను అతని పట్ల ఆకర్షితులను చేసాను. అందుకే ఇన్ని సీట్లు గెలవగలిగామని చెప్పాడు. దానికి కేసీఆర్ షాకై... నామైండ్ అంతంత మాత్రం... పూర్తిగా అర్ధమయ్యేటట్లు చెప్పు అని అడిగాడు. చెప్పను చూపిస్తాను అంటూ కేటీఆర్ కేసీఆర్ ముందు వేళ్ళతో స్క్రీన్ గేసి సీన్ ప్లే చేశాడు.

★★★★★

అది కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలని... సీమాంధ్ర సెటిలర్స్ ఎక్కువుగా వుంటున్న ప్రాంతం. సెటిలర్స్‌తో మీటింగ్ జరుగుతోంది. కేటీఆర్ ప్రసంగిస్తున్నాడు. ఈరోజు హైదరాబాద్ నగరం ఈ స్థాయిలో ఉందంటే అది మీ ఆంధ్రా చంద్రబాబు పుణ్యమే. ఇప్పుడు ఆంధ్రాకు కూడా ఇలాంటి సిటీ కావాలి. అమరావతి కూడా హైదరాబాద్‌లాగా చేయాలంటే చంద్రబాబు పూర్తి స్థాయిలో అక్కడే వుండాలి. అమరావతి కూడా ఈ స్థాయిలో అభివృద్ధి చెందితే బాగుపడేదంతా మీ అన్నలు, మీ తమ్ముళ్లు, చెల్లెల్లే... ఈరోజు అమరావతికి చంద్రబాబు అవసరం ఎంతో వుంది. ఆయనను పూర్తి స్థాయిలో అమరావతికి పంపించాలంటే మీరంతా కూడా తెలుగుదేశంకు ఓట్లేయకూడదు. మీ రాష్ట్రం కోసం, మీ వాళ్ల కోసం ఆలోచించండి... మీ ఓట్లు ఎవరికి వేస్తారని కేటీఆర్ ప్రశ్నించాడు. మా రాష్ట్ర భవిష్యత్ కోసం సైకిల్‌కు కాదు, కారుకే వేస్తాం అని సెటిలర్స్ ముక్తకంఠంతో చెప్పారు. ఇక్కడితో సీన్ అయిపోయింది.

అదంతా చూసాక కేసీఆర్ కొడుకును భుజం తట్టి అభినందిస్తూ... నాకు నెగటివ్ కోణమే తెలుసు... పాజిటివ్ కోణంలో కూడా ఎలా గెలవగలమో నిరూపించావని మెచ్చుకున్నాడు.

# రైల్వే అభివృద్ధికి కీలకపాత్ర పోషించాం

- రైల్వే బడ్జెట్‌లో సింహపురికి నిధులు కేటాయించండి
- ప్రధాని మోడీకి కేంద్రమాజీమంత్రి పనబాక లేఖ



రైల్వే అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ పార్టీ తరపున 1996 నుంచి కీలకపాత్ర పోషించామని మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్యలు పేర్కొన్నారు. బుధవారం నెల్లూరులోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న రైల్వే బడ్జెట్‌లో సింహపురికి నిధులు కేటాయించాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోడీకి, రైల్వేమంత్రి సురేష్ ప్రభుకు లేఖలు వ్రాసినట్లు తెలిపారు. గూడూరు-దుగరాజ పట్నం మధ్య బ్రాడ్‌గేజ్ రైల్వేపనులకు ఈ రైల్వే బడ్జెట్‌లో రూ.100కోట్లు కేటాయించాలని పనబాక లక్ష్మి కోరారు. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైను పనులను అర్ధంకి మీదుగా చేపట్టాలని కోరారు. దాదాపు 300 కి.మీ పొడవైన ఈ రైల్వేలైను పూర్తి చేయడానికి రూ.1313కోట్లు అవసరమని వివరించారు. ఈ యేడాది కనీసం రూ. 600కోట్లు విడుదల చేయాలని కేంద్రాన్ని కోరారు. తాను ఎంతో కృషి చేసి జిల్లా పేరుతోనే సింహపురి ఎక్స్‌ప్రెస్‌ను సాధిస్తే, దానిని ఈమధ్య కాలంలో పింహపురిగా మార్చారని పనబాక లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. సింహపురి ఎక్స్‌ప్రెస్‌ను గతంలో లాగా వున్న వేళల ప్రకారం నడిపేలా ప్రయత్నిస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర సమన్వయ కమిటి సభ్యుడు సి.వి.శేషారెడ్డి, నగర అధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్, రాష్ట్ర కమిటి నాయకులు చెంచలబాబుయాదవ్, రఘురావ్ ముదిరాజ్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, వివిధ విభాగాల జిల్లా అధ్యక్షులు పందిళ్లపల్లి అరుణమ్మ, శివ, ఆసిఫ్, శివాచార్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ నిరుపేద మహిళలకు భూములు

భూమి లేని షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుపేద మహిళా వ్యవసాయ కూలీలకు భూమి కొనుగోలు చేయుటకు లబ్దిదారుల ఎంపిక కార్యక్రమం త్వరిత గతిన చేపట్టాలని సంయుక్త కలెక్టర్ ఎ.ఎం.డి.ఇంతియాజ్ అన్నారు.



గురువారం జాయింట్ కలెక్టర్ తన ఛాంబర్లో భూమి లేని మహిళ ఎస్సీ నిరుపేదలకు భూమికొనుగోలు పథకంపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం క్రింద ఎంపిక కాబడే లబ్దిదారులు డ్వాక్రా మహిళలై వుండాలని, వారికి ఎటువంటి సొంత భూమి గాని, ప్రభుత్వం నుండి పొందిన భూమి గాని వుండకూడదన్నారు. ఈ లబ్దిదారులు వయస్సు 18సం. నుండి 65సం. వుండాలని, వారి వార్షిక ఆదాయం రూ. 81వేలు దాటకూడదని, తప్పనిసరిగా వివాహితులై వుండాలన్నారు. ఎంపిక కాబడిన లబ్దిదారులకు 5లక్షల ఖర్చుతో ఒక ఎకరం మాగాణి గాని, రెండు ఎక రాల మెట్ట భూమి గాని గుర్తించి యూనిట్ విలువలో 75శాతం గాని, రెండు లక్షల రూపాయలకు మించకుండా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని, మిగిలిన వ్యయం శ్రీనిధి సంస్థ ద్వారా రుణం లబ్దిదారులకు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుండి నిధులు మంజూరు కాగానే నిబంధనలు ప్రకారం లబ్దిదారులకు భూమిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

ఈ సమావేశంలో గూడూరు సబ్ కలెక్టర్ గిరీషా, ఎస్సీ కార్పొరేషన్ ఇ.డి వై.రామచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పి.డి చంద్రమౌళి, డ్వామా పిడి హరిత, వ్యవసాయశాఖ జెడి వేణుకృష్ణ పాల్గొన్నారు.

# జూబ్లీ ఆసుపత్రిలో రిజిస్ట్రేషన్ ఆఫీసు




నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన డిఐజి

నెల్లూరుజిల్లా కోర్టు కాంపౌండులో ఉండే రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయాన్ని నెల్లూరు మద్రాసుబస్టాండు ప్రక్కనున్న జూబ్లీ ఆసుపత్రి ప్రాంగణానికి తరలించారు. బుధవారం రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాన్ని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి పి.గిరిబాబు ప్రారంభించి మాట్లాడుతూ నూతన రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ప్రజలు ఆదరించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కొత్త భవనంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసామన్నారు. ఇప్పటి నుండి నూతన భవనంలోనే రిజిస్ట్రేషన్ వ్యవహారాలు స్థిరాస్తి క్రయవిక్రయాలకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు జరుగుతాయన్నారు. నూతన భవనాన్ని మంజూరు చేసినందుకు కలెక్టర్ జానకికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని కంప్యూటర్ విభాగాన్ని నెల్లూరు జిల్లా రిజిస్ట్రార్ యం.అబ్రహం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సబ్‌రిజిస్ట్రార్ పూడి నరేంద్రరావు, సబ్‌రిజిస్ట్రార్లు వి.వి.ప్రసాదరెడ్డి, సయ్యద్ మహబూబ్‌బాషా, కావలి సబ్‌రిజిస్ట్రార్ ఐ.విజయరాణి, అధికారులు పాల్గొన్నారు.

## 115 సంవత్సరాల సేవలు



నెల్లూరుజిల్లా కోర్టు కాంపౌండులో రిజిస్ట్రార్ కార్యాలయాన్ని 1901లో బ్రిటీష్‌వారి హయాంలో నిర్మించారు. ఇప్పటికి దాదాపు 115సంవత్సరాల పాటు వినియోగదారులకు సేవలందించింది. అంతటి ఘనచరిత్రగల రిజిస్ట్రార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో మార్పు చేయాల్సి వచ్చింది.



## కావలి కబుర్లు

# వాసవి క్లబ్ పునరుద్ధరణ



కావలి పట్టణంలో వాసవి క్లబ్‌ను పునరుద్ధరించారు. 2016 సంవత్సరానికి క్లబ్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ అంతర్జాతీయ సహాయ కోశాధికారి మాదాల జగదీష్ ఆధ్వర్యంలో క్లబ్‌కు కొత్త కమిటీ నియామకం జరిగింది. అధ్యక్షులుగా జలదంకి గిరీష్‌కుమార్, కార్యదర్శిగా కనుమర్లపూడి బాలకోటేశ్వరరావు, కోశాధికారిగా చలువాది సత్యనారాయణలను ఎన్నుకున్నారు. ఈ కొత్తకమిటి ఎంపిక కార్యక్రమంలో కనుమర్లపూడి హరిప్రసాద్, తిరివీధి కిషోర్, మల్లికార్జునరావు, అనుమాలశెట్టి శివకుమార్, సోమిశెట్టి రమేష్, గాదంశెట్టి శివ, సునీల్, లక్ష్మణ్, శేఖర్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కల పంపిణీ



కావలి పట్టణ మున్సిపాలిటీ 40వ వార్డులోని అడవిరాజు పాలెం, కామాటివారివీధిలో ఇటీవల మొక్కలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఛైర్మెన్ భరత్ కుమార్ యాదవ్, వార్డు కౌన్సిలర్ దేగా రామయ్యయాదవ్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలి

**- రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీద**

కావలి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు అన్ని పార్టీలు సహకరించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలని రాష్ట్ర రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీద మస్తాన్‌రావు అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కాలువలకు పంపిన ప్రతిపాదనల్లో ఎలాంటి కోతలు లేకుండా రూ. 6.81కోట్ల ఎఫ్‌ఆర్‌డి నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రతిపక్ష నాయకులు సభలలో కలిసి పని చేద్దామంటూ ప్రక్కకుపోయి మమ్మల్ని విమర్శిస్తున్నారన్నారు. ఇలాంటి విమర్శలు మానుకొని ప్రజల అభివృద్ధిపై దృష్టిపెడితే బాగుంటుందని సూచించారు.



ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఛైర్మెన్ భరత్‌కుమార్, మాజీఛైర్మెన్ శ్రీనివాసకిరణ్, పట్టణ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, జి.వేణు తదితరులు పాల్గొన్నారు.

# విద్యావంతులు సైతం ప్రేమకు బలి

సమాజంలో మొన్న మొన్నటి వరకు చదువుకోని అమాయక స్త్రీలు ప్రేమ పేరుతో మోసపోయి ఆత్మహత్యలతో అసువులు బాసిన వారెందరో వున్నారు. నేడు విద్యావంతులు సైతం కపట ప్రేమకు, క్షణికావేశానికి లోనవుతున్నారు. ప్రేమ అనే మత్తులో మునిగి ఉనికి కోల్పోతున్నారు.



తాజాగా కావలి పట్టణం కో-ఆపరేటివ్ కాలనీలో ఆత్మహత్య చేసుకున్న మాధవి విద్యావంతురాలు కావటం విశేషం. ఈమె ఒక ప్రైవేటు కళాశాలలో పనిచేస్తూ భానుతేజతో ప్రేమలో పడింది. వీరి ప్రేమ పెళ్ళి వరకు వెళ్లింది. అయితే పెళ్లికి కులం అడ్డురాగా భానుతేజ కుటుంబసభ్యులు విముఖత చూపారు. దీంతో మాధవి మనస్తాపం చెంది జరిగిన విషయాన్ని ఫోన్‌లో వీడియో ద్వారా రికార్డు చేసి ఆత్మహత్య చేసుకుంది. ఈ వీడియో ఆధారంగా కావలి 2వ పట్టణ సిఐ ఎం.మధుబాబు సూచనల మేరకు ఎస్ఐ అన్వర్‌భాషా భానుతేజను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

# నెల్లూరోళ్ళకు పదివేలకు పైగా ఇళ్ళు

డబుల్ బెడ్‌రూం ఇళ్ళ కోసం అర్హులైన వారు ఈ నెల 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. 6వ తేదీ నెల్లూరు నగర టిడిపి సమావేశం నగర ఇన్‌ఛార్జి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం నగరంలో ఇళ్ళు లేని వారి కోసం 10,050 ఇళ్ళను మంజూరు చేసిందన్నారు. నెల్లూరు రూరల్ నియోజక వర్గంలోని అక్కచెరువుపాడులో గ్రూపు ఇళ్ళు నిర్మిస్తామన్నారు. ఒక్కో ఇంటికి రూ. 4.80 లక్షలు ఖర్చవుతోందని, అందులో రూ. 50వేలు లబ్ధిదారుడి వాటా, రూ. 2లక్షలు హడ్కో రుణం, రూ. 2.30లక్షలు ప్రభుత్వ సబ్సిడీ ఉంటుందన్నారు. ఆక్రమణల తొలగింపులో(రైల్వే స్థలాలు, కాలువలపైన, ఇరిగేషన్ కాలువలు, పంటకాలువలు) ఇళ్ళు కోల్పోయిన వారికి లబ్ధిదారుల వాటా ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్రమంత్రి నారాయణ చొరవతో నగరానికి మరో 15వేల ఇళ్ళు మంజూరు కానున్నాయన్నారు. ఈ సమావేశంలో కావలి ఎఎంసి ఛైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, రమేష్‌రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్‌భవ ప్రారంభం



తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూధర్మ ప్రచార పరిషత్, హిందూ ధర్మ ప్రచార మండలి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరు జయభారత్ హాస్పిటల్‌లో ఆయుష్మాన్‌భవ అనే వినూత్న కార్యక్రమం ప్రారంభమైంది. హాస్పిటల్‌లోని రోగులకు శ్రీవారి ప్రసాదము, శ్రీవారి రక్ష, అమ్మవారి కుంకుమ, రొట్టె, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూధర్మ ప్రచారమండలి అధ్యక్షులు సి.వి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు కొండా శేఖర్‌రెడ్డి, కార్యదర్శి ధనుంజయ, హిందూ ధర్మప్రచార పరిషత్ కో-ఆర్డినేటర్ మల్లెల శ్రీహరి, జయభారత్ ఆసుపత్రి మేనేజర్ డా॥ బి.శ్రీనివాసులు, గురుప్రసాద్, ఆలూరి శిరోమణిశర్మ, వీరిశెట్టి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పద్మనాభరెడ్డి మరణం జిల్లాకు తీరని లోటు

నెల్లూరుజిల్లా పరిషత్ మాజీ వైస్‌ఛైర్మెన్ చిట్టమూరు పద్మనాభరెడ్డి మరణం నెల్లూరుజిల్లాకు తీరని లోటని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్లపల్లి అరుణమ్మ పేర్కొన్నారు. బుధవారం ఆమె మనుబోలులో పద్మనాభరెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ 20సంవత్సరాలుగా మనుబోలు సర్పంచ్‌గా, అయిదేళ్లు మనుబోలు మండల పరిషత్ వైస్‌ఛైర్మెన్‌గా, మరో ఐదేళ్లు నెల్లూరుజిల్లా పరిషత్ వైస్‌ఛైర్మెన్‌గా పద్మనాభరెడ్డి పని చేశారన్నారు. ప్రజల అభిమానాన్ని సంపాదించిన రాజకీయనేతగా పద్మనాభరెడ్డికి మంచి పేరుందన్నారు. పద్మనాభరెడ్డి 40సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో మనుబోలు మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారన్నారు.

# ఏసి స్టేడియంలో ఆధునీకరణ పనులు

నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఆధునీకరణ పనులు వేగవంతమయ్యాయి. ప్రభుత్వం ఇటీవల ఈ పనులకు రూ. 2.9కోట్లను మంజూరు చేసింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం క్రీడా ప్రాంగణంలోని స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో గదుల పైకప్పు, ప్రహరి, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ప్రధాన కార్యాలయం, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ఇండోర్ స్టేడియంలో ఉడెన్ పైకప్పు, మైదానంలో డ్రైనేజీ మరమ్మత్తులు చేస్తున్నారు. మూడు నెలల పాటు పనులు జరుగనున్నాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎతిరాజ్ పేర్కొన్నారు.

# ముసవ్వీర్‌కు గోల్డన్‌స్టార్



బంగారం, వెండితో అనేక సూక్ష్మ నమూనాలను తయారుచేసి అనేక వరల్డ్ రికార్డులతో పాటు డాక్టరేట్‌ను సొంతం చేసుకున్న నెల్లూరు జెండావీధికి చెందిన స్వర్ణకారుడు షేక్ ముసవ్వీర్ న్యూజిలాండ్‌కు చెందిన "గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డ్స్ ఫోరం"లో స్థానం సంపాదించాడు. గతంలో 400 మి.గ్రా.ల బంగారంతో హజ్‌యాత్రలో మరణించిన వారి కోసం మక్కా నమూనా తయారు చేసినందుకు ముసవ్వీర్‌ను గోల్డెన్ స్టార్ ఇండియా కో-ఆర్డినేటర్ డా॥ ప్రజ్ఞ ఈ అవార్డుతో సత్కరించారు.

# టెండర్లలో వండర్లు

(మొదటి పేజీ తరువాయి)

తన ప్రైవేట్ కార్యాలయంలో అధికార పార్టీ కార్పొరేటర్లు, మున్సిపల్ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించాడు. మున్సిపల్ కాంట్రాక్టర్ కమ్ కార్పొరేటర్ అయిన రాజానాయుడు నేతృత్వంలో కార్పొరేటర్‌లు, కాంట్రాక్టర్ల సిండికేట్ అంతా సమావేశమైంది. ఎన్నికల్లో కార్పొరేటర్లు అందరూ బాగా ఖర్చు పెట్టారని, కాబట్టి వాళ్లు కూడా నాలుగు రాళ్లు సంపాదించుకోవాలని చెప్పిన మేయర్, 13.75కోట్లతో చేపట్టే 51పనులకు ఎవరూ లెస్‌లతో టెండర్లు వేయవద్దని, అవసరమైతే ఎక్సెస్‌తో టెండర్లు వేయాలని కాంట్రాక్టర్లకు సూచించాడు. ఏ వర్క్ ఏ కాంట్రాక్టర్‌కు అనేది కూడా అక్కడే నిర్ణయించేసి ఎవరికి ఎంతెంత కమిషన్ అనేది కూడా అక్కడే మాట్లాడేసుకున్నారు. మీకు పోటీగా ఎవరు టెండర్లు వేసినా వర్క్‌లు కాన్సిల్ చేయడం లేదా బిల్లులు ఆపడం చేస్తానని కూడా ఆయన హామీ ఇచ్చారని సమాచారం. రాజానాయుడు నేతృత్వంలో పనులు పంపకాలు పూర్తి చేసి 5, 6తేదీలలో టెండర్లు వేశారు.

అయితే ఇక్కడే కథ అడ్డం తిరిగింది. 6వ తేదీ మధ్యాహ్నంపైన వైకాపా కార్పొరేటర్లు, తెలుగుదేశంపార్టీలో అజీజ్ వ్యతిరేక వర్గంగా వున్న ఆనం రంగమయూర్ రెడ్డి తరపు కాంట్రాక్టర్లు ఈ 51పనులకు లెస్‌లతో టెండర్లు వేశారు. ఈ సంఘటనతో మేయర్ వర్గం కార్పొరేటర్ల గొంతులో వెలక్కాయ పడ్డట్లయ్యింది. వీరిని నమ్మి టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు అయోమయంలో పడ్డారు. టెండర్లు ఓపెన్ చేస్తే తమ వారికి ఒక్క పని కూడా దక్కదనే విషయం మేయర్ వర్గీయులకు అర్థమైంది.

ఇదే సమయంలో కమిషనర్‌గా వున్న పివివిఎస్ మూర్తి బదిలీ కావడం మేయర్ వర్గానికి ఒక ఆయుధంగా దొరికింది. 5వ తేదీ బదిలీ ఆర్డర్స్ వచ్చినా పివివిఎస్ మూర్తి రిలీవ్ కాలేదు. అధికార హోదాలో ఆయన 6వ తేదీ టెండర్లను తెరచి ఉండొచ్చు. కాని ఈ కార్పొరేషన్ గబ్బు నాకెందుకు... ఇప్పటికే అయ్యింది చాలు... ఇప్పుడన్నా ప్రశాంతంగా వెళ్లిపోదామనుకున్న ఆయన టెండర్ల జోలికి పోలేదు. నేను పూర్తి స్థాయి కమిషనర్‌ను కాదంటూ ఇన్‌ఛార్జ్ కమిషనర్ కూడా టెండర్ బాక్స్ తెరవలేదు.

మేయర్ అజీజ్ కావాలనే టెండర్ బాక్స్ తాళం తన వద్ద పెట్టుకున్నాడని, వెంటనే టెండర్లు ఓపెన్ చేసి పనులు ప్రారంభించాలంటూ ఓ పక్క వైకాపా ఎమ్మెల్యే అనిల్, మరోపక్క తెలుగుదేశం కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డిలు విమర్శల దాడిని తీవ్రం చేశారు. కాంట్రాక్ట్ పనుల్లో కమిషన్‌లు తిన్న విశ్వాసంతో అధికారపార్టీ కార్పొరేటర్లు ఎక్కువమంది ఈ విషయంలో అజీజ్‌కు అండగా నిలిచారు.

ఇప్పుడు 13.75కోట్ల పనుల్లోనే ఈ రీతిలో వాటాలేసుకుని కమిషన్లు పంచుకుంటే, రేపు 13, 14వ ఆర్థిక సంఘం నిధులు, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్, జనరల్ గ్రాంట్, వరద సహాయక చర్యల ఫండ్స్, రహదారుల విస్తరణ నిధులు... మొత్తం కలిపి 142కోట్ల దాకా నిధులతో పనులు మంజూరు కానున్నాయి. ఈ నిధులను కూడా వీళ్లు ఇదే విధంగా వాటాలేసుకుని పంచేసుకోరా?

నెల్లూరు నగరపాలక సంస్థలో గతంలోనూ అవినీతి జరిగింది. అయితే ఇలా సమావేశాలు నిర్వహించి బహిరంగంగా కమిషన్లు నిర్ణయించుకున్న దాఖలాలు లేవు. 2014 మున్సిపల్ ఎన్నికల్లో నేను సచ్ఛీలుడిని, నిజాయితీకి ప్రతిరూపమని, నా వ్యాపార టర్నోవర్ 1300కోట్లని, నెల్లూరు కార్పొరేషన్ బడ్జెట్ ఆఫ్టాల్ వంద కోట్లేనని చెప్పిన అజీజ్... ఇప్పుడు ఈ కమిషన్ల కక్కుర్తికి ఎందుకు పాల్పడుతున్నట్లో? నెల్లూరు కార్పొరేషన్‌లో మొన్నటి దాకా అవినీతి గుట్టు చప్పుడు కాకుండా జరిగేది. ఇప్పుడు బహిరంగమైంది. రేపు దీనిని అధికారికంగా చేసినా ఆశ్చర్య పోనవసరం లేదు.

# హైటెక్ బాబుకు హైదరాబాద్ పిచ్చి వదిలేనా?

(మొదటి పేజీ తరువాయి)


మేయర్ అభ్యర్థిగా తీగల కృష్ణారెడ్డి అఖండ విజయం సాధించడం చూసాం. అంతెందుకు ఐదేళ్ల క్రితం జరిగిన గ్రేటర్ ఎన్నికలలోనూ తెలుగుదేశంకు గౌరవప్రదమైన సీట్లే వచ్చాయి. 2014అసెంబ్లీ ఎన్నికల్లో సైతం జంట నగరాలలో అత్యధిక నియోజకవర్గాలలో రెపరెపలాడింది తెలుగుదేశం జెండానే!

ఆ ఎన్నికలు ముగిసి గట్టిగా ఒకటిన్నర ఏడాది కాలేదు. అంతలోనే ఎంత మార్పు? 150డివిజన్‌లున్న గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం గెలుచుకుంది ఒకే ఒక్క సీటు. అది కూడా చచ్చీ చెడి చావు తప్పి కన్ను లొట్టబోయినట్లుగా? ఇంతకాలం టిఆర్ఎస్ వాళ్లు హైదరాబాద్‌ను వదిలిపొమ్మని చంద్రబాబును నోటితో చెబుతూ వచ్చారు. ఏ సెటిలర్స్‌నైతే నమ్ముకుని చంద్రబాబు హైదరాబాద్‌ను పట్టుకుని ఊగుతున్నాడో ఆ సెటిలర్సే ఇప్పుడు చంద్రబాబుకు హైదరాబాద్‌తో ఇక మీకేం పనని ఓటుతో చెప్పారు. తెలంగాణలో తెలుగుదేశం చాప్టర్ క్లోజ్ అని గ్రేటర్ ఫలితాలు చెప్పకనే చెబుతున్నాయి. హైదరాబాద్‌లోని సీమాంధ్ర సెటిలర్స్ అంతా కూడా ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ వైపు మొగ్గు చూపారు. వాళ్లు తెలంగాణలో ఉన్నారు. కాబట్టి అక్కడి పార్టీలతో పోవాలి. తెలుగుదేశాన్ని గెలిపిస్తే అక్కడ సెటిలర్స్‌కు ఒరిగేదేమీ లేదు. 'ఓటు-నోటు' కేసు అంటేనే ముఖ్యమంత్రి స్థాయిలో వున్న చంద్రబాబే చాలారోజులు హైదరాబాద్‌కు వెళ్లడానికి భయపడ్డాడు. అలాంటిది టిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఓట్లేస్తే రేపు హైదరాబాద్‌లో సెటిలర్స్ పరిస్థితి ఏంటి? కేసీఆర్ జేసీబీ మిషన్‌లు పెట్టేది వీళ్ల ఇళ్ల ముందే! రాష్ట్ర విభజన ఎలాగూ జరిగిపోయింది. ఇరు రాష్ట్రాల ప్రజలు మానసికంగా సర్దుకున్నారు. కేసీఆర్ కూడా ఈమధ్య ప్రాంతీయ ఉన్మాదాన్ని వీడి మామూలు మనిషిగా మారాడు. హైదరాబాద్‌లో ఉండేవాళ్లంతా తెలంగాణ బిడ్డలేనంటున్నాడు. గ్రేటర్ ఎన్నికల్లో కేటీఆర్ ప్రచారం కూడా సెటిలర్స్‌ను టీఆర్ఎస్ వైపు ఆకర్షితులను చేసింది. సెటిలర్స్ మూకుమ్మడిగా టీఆర్ఎస్‌కు జైకొట్టబట్టే కేసీఆర్‌కు కారుకు 99ఫ్యాన్సీ నెంబర్ సీట్లొచ్చాయి. కారు దెబ్బకు చంద్రబాబు సైకిల్ తునాతునకలైంది. తెలుగుదేశంతో జోడీ కట్టిన పాపానికి బీజేపీకి కూడా షాక్ తగిలింది. ఎంఐఎంకు ఆ సీట్లు అనేవి ఎలాగూ వచ్చేవే! గ్రేటర్ ఎన్నికల్లో అతిపెద్ద షాక్ తగిలిన కాకిలాగా అయ్యింది కాంగ్రెస్‌పార్టీ. తెలంగాణ రాష్ట్రాన్ని చేజిక్కించుకోవాలనే ఆశతో అతి కిరాతకంగా విభజనకు పాల్పడిన ఆ పార్టీకి 2సీట్లే దక్కాయి. ఆ పార్టీ పాపానికి తగిన ప్రాయశ్చితమిది. గ్రేటర్ ఎన్నికల ఫలితాలు ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాయి. హైదరాబాద్‌లో తెలుగుదేశంకు మనుగడ లేదని. చంద్రబాబు శాశ్వతంగా సామాన్లు సర్దుకుని అమరావతికి పోవచ్చని!

# బలయ్యేది ఎవరు?

(మొదటి పేజీ తరువాయి)

పార్టీని మూడు దశాబ్దాలుగా తమ భుజాలపై మోస్తున్న బలహీనవర్గాల ప్రజలు దూరమవుతారు. ఇప్పటికే ఓ పక్క కాపులు మరోపక్క బీసీలు పోటాపోటీగా ఆందోళనలు చేస్తున్నారు. బీసీలలో చేర్చకుంటే మీ అంతు చూస్తామంటూ కాపులు, మా అవకాశాలకు గండి కొడితే మా బలమేంటో చూపిస్తామంటూ బలహీనవర్గాల వాళ్లు చంద్రబాబుకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘించి రిజర్వేషన్లను 50శాతానికి పైగా పెంచడానికి కుదరకపోవచ్చు. అగ్రవర్ణాలకు అవకాశాలు దక్కేదే ఓపెన్ కేటగిరిలో! ఈ కొద్ది అవకాశాలకు కూడా గండికొడితే చంద్రబాబు మీద అగ్రవర్ణాల వాళ్లు పగబట్టే అవకాశముంది. బిసిల రిజర్వేషన్ కోటా పెంచకుండా కాపులను బిసిలలో చేరిస్తే మాత్రం బలహీనవర్గాలు తెలుగుదేశానికి దూరం కావడం ఖాయం. ఏదో వంక చెప్పి రిజర్వేషన్లు ఎగ్గొడితే మరోసారి దగా పడేది కాపులే! ఏదేమైనా చంద్రబాబు రాజకీయ క్రీడకు అటు బలిజలు గాని ఇటు బలహీనులు గాని... ఒకరు బలి కావాల్సిందే! ఒకవేళ ఇద్దరికీ న్యాయం చేయాలనుకుంటే అన్యాయమయ్యేది అగ్రవర్ణాలుగా ముద్రపడ్డ పలు కులాల్లోని పేదలే!





## కలియుగ ప్రత్యక్ష దైవానికి
# కన్నుల పండువగా వైభవోత్సవాలు

- హైదరాబాద్‌లో మార్మోగిన గోవింద నామస్మరణ
- నెల్లూరీయుల ఆధ్వర్యంలో అత్యద్భుంగా శ్రీవారి వేడుకలు





ఆపద మొక్కులవాడు, ఏడుకొండల స్వామి, కలియుగ ప్రత్యక్షదైవమైన ఆ తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామికి హైదరాబాద్‌లో కన్నుల పండువగా వైభవోత్సవాలు జరిగాయి. సంప్రదాయబద్ధంగా, ఆగమశాస్త్రోక్తంగా ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో వేలాదిమంది భక్తజనులు, ఎంతోమంది ప్రముఖులు పాల్గొని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామిని కన్నులారా తిలకించి తరించిపోయారు. శ్రీవారి వైభవోత్సవాల వేదికగా మారిన హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం ఈ వారం రోజులూ భక్తజనసంద్రంగా మారింది. తిరుమలలోని స్వామివారి వేదపండితుల ఆధ్వర్యంలో అమోఘంగా పఠించే వేద మంత్రోచ్ఛారణల మధ్య, మంగళవాయిద్యాల మధ్య, అశేష భక్తజనవాహిని పెద్దపెట్టున చేస్తున్న గోవింద నామస్మరణల మధ్య శ్రీవారి వైభవోత్సవాలు ఆద్యంతం అత్యద్భుతంగా జరిగాయి. తిరుమలలో శ్రీవారికి నిర్వహించే అన్ని సేవలు, ప్రత్యేక పూజలను భక్తులందరూ దర్శించుకునే భాగ్యాన్ని కల్పించాలనే ఉద్దేశంతో తిరుమల తిరుపతి దేవస్థానంవారు, టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్తంగా ఈ కార్యక్రమాలను సభక్తికంగా నిర్వహించి తన విశిష్టతను చాటుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా, ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీవారి వైభవోత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహించింది. ఈ ఉత్సవాల అంకురార్పణలో తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ దంపతులు, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు పాల్గొని శ్రీవారి వైభవోత్సవాలను ప్రారంభించారు. సాక్షాత్తూ శ్రీ వేంకటేశ్వరుడే తిరుమల నుంచి తరలివచ్చాడా అన్నట్లుగా జరిగిన ఈ వైభవోత్సవాల్లో స్వామివారికి జరిగిన విశేష పూజలను, కోట్లాదిరూపాయలు ఇచ్చుకున్నా తిరుమలలో దర్శించుకోలేని శ్రీవారి సేవలను సైతం ఇక్కడ దర్శించుకున్న భక్తులు అమందానంద కందళిత హృదయారవిందులై భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. తిరుమలలోని శ్రీవారి కోవెలలో నిత్యం జరిగే అనేక పూజలు, సేవలు అందరికీ దర్శనీయం కావడంతో భక్తుల ఆనందానికి అవధులే లేవు. ఎంతో విశిష్టమైన శ్రీవారి సుప్రభాతసేవ, తోమాల సేవ, కొలువు, అర్చన, నివేదన, శాత్తుమొర తదితరాలతో పాటు, వేడుకకే వేడుక అన్నట్లుగా వైభవాతివైభవంగా జరిగే శ్రీవారి సహస్ర దీపాలంకరణ సేవ, ఊరేగింపులు, రాత్రి కైంకర్యాలు, ఏకాంత సేవలతో పాటు ఎంతో పుణ్యప్రదమైన వసంతోత్సవం, అష్టదళ పాదపద్మారాధన సేవ, సహస్ర కలశాభిషేకం, తిరుప్పావడ, శ్రీవారి కల్యాణోత్సవం, అభిషేక సేవ, అనేకరకాల సుగంధభరిత పుష్పాలతో స్వామికి కన్నులపండువగా నిర్వహించే పుష్పయాగం..ఇలా అన్ని సేవలు, అన్ని విశేష పూజలు దర్శించుకున్న భక్తులు తమ జన్మ ధన్యమైందని మనసారా భావించుకుంటూ, ఆ గోవిందుని నామస్మరణలో పునీతమయ్యారు. స్వామివారికి నిత్యపూజలు నిర్వహించే అర్చకులు ఇక్కడ అత్యద్భుంగా ఏర్పాటుచేసిన వేదికపై స్వామివారికి ఇలా విశిష్టమైన పూజలు, సేవలు చేస్తుంటే ఆ దేవదేవుని సేవలను కళ్ళారా చూసి తరించే అదృష్టం భాగ్యనగరవాసులకు కలగడం నిజంగా ఒక భాగ్యమే!..నెల్లూరీయుల ఆధ్వర్యంలో ఈ దైవ కార్యక్రమాలన్నీ ఎంతో భక్తితో జరిగాయి. గత ఏడాది నెల్లూరులో కూడా ఇదేవిధంగా శ్రీవారి వైభవోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించిన ప్రముఖ దాత, ఆధ్యాత్మిక చింతనాపరుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఆధ్వర్యంలో, కేంద్రమంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు, ఆయన కుమార్తె దీపావెంకట్‌ల సారధ్యంలో శ్రీవారి వైభవోత్సవాలు అత్యద్భుతంగా జరిగాయి. ఆ తర్వాత ఢిల్లీలో కూడా ఈ ఉత్సవాలను మరింత వేడుకగా నిర్వహించి వీరు తమ భక్తిని చాటుకున్నారు. ఇప్పుడు కూడా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పాటు, నెల్లూరుకు చెందిన ప్రముఖులు కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు తనయుడు హర్షవర్ధన్ (హర్ష టయోటా షోరూమ్‌ల అధినేత), వంశీరామ్ బిల్డర్స్ అధినేత సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు హైదరాబాద్‌లో ఎంతో వేడుకగా నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్నారు. శ్రీవారి వైభవోత్సవాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ దంపతులతో పాటు, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు దంపతులు, కేంద్రమంత్రులు బండారు దత్తాత్రేయ, జగత్‌ప్రకాశ్ నడ్డా, ఎంపి మల్లారెడ్డి, టిటిడి బోర్డు సభ్యులు కె.రాఘవేంద్రరావు, భానుప్రకాశ్‌రెడ్డి, టిటిడి జెఇఓ పోలా భాస్కర్, బిజెపి నేతలు జి.కిషన్‌రెడ్డి, డా.లక్ష్మణ్, ప్రముఖ సినీనటులు అక్కినేని నాగార్జున, అల్లరి నరేష్, పరుచూరి గోపాలకృష్ణ, న్యాయమూర్తులు జస్టిస్ రామ్మోహన్‌రావు, అశోక్‌బాబు, న్యాయకోవిదుడు మాడభూషి శ్రీధర్ తదితర ప్రముఖులెందరో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన భక్తి సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులందరినీ బాగా ఆకట్టుకున్నాయి. ప్రముఖ సంగీతజ్ఞులు సాలూరు వాసురావు బృందం ఆలపించిన అన్నమయ్య కీర్తనలు, బెంగుళూరు ఆర్ట్ ఆఫ్ లివింగ్‌కు చెందిన శాలినీ శివశంకర్ బృందం ఆలపించిన సంకీర్తనలు, ప్రముఖ గాయని శోభారాజ్ మధురగానంతో ఆలపించిన అన్నమయ్య కీర్తనలు అందరినీ భక్తిపారవశ్యులను చేశాయి.

# 'వాత్సల్య' చిన్నారులకు టిటిడి ఆహ్వానం

### - రథసప్తమినాడు శ్రీవారి ఊరేగింపులో కోలాటం ప్రదర్శన



నెల్లూరులోని జనహిత-వాత్సల్య సంస్థలోని నిరాధార బాలబాలికలకు, ఇక్కడ చదువుకుంటున్న హైస్కూల్ విద్యార్థులకు ఎంతో సంతోషం కలిగిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం వారి నుంచి ఆహ్వానం అందింది. వాత్సల్య చిన్నారులు ప్రదర్శించే కోలాటం భజనల ప్రదర్శనకు టిటిడి అనుమతినిచ్చింది. తిరుమలలో ఈ నెల 14న రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని వివిధ వాహనసేవలతో ఎంతో వైభవంగా నిర్వహించే స్వామివారి ఉత్సవ ఊరేగింపులో వాత్సల్య చిన్నారులు కోలాటం కళారూపాన్ని ప్రదర్శించేందుకు వారినుంచి ఆహ్వానం అందింది. సుమారు 35 మంది చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, కోలాటం బృందానికి గురువైన సురేష్ బాబుతో పాటు కోలాటం ప్రదర్శించే చిన్నారులు హారతి, నిషికారాజ్, సురేష్, గోపీచంద్ తదితరులంతా కలసి రథసప్తమి రోజున తిరుమలకు చేరుకుని స్వామివారి ఊరేగింపులో పాల్గొని కోలాటం ప్రదర్శిస్తారని జనహిత-వాత్సల్య సంస్థల కార్యదర్శి జివి సాంబశివరావు తెలియజేశారు. కాగా, వాత్సల్య చిన్నారులు చదువుతోపాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక రంగాల్లోనూ ఎనలేని శ్రద్ధ చూపుతూ అనేక కార్యక్రమాల్లో తమ ప్రతిభాపాటవాలతో అందరినీ ఆకట్టుకుంటున్నారు. ఇక్కడి విద్యాలయాల్లో చదువుకుంటున్న పలువురు చిన్నారులు భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం, శివస్తుతి వంటి ఆధ్యాత్మిక అంశాల్లో ఆసక్తితో కళారూపాల ద్వారా వాటికనుగుణమైన ప్రదర్శనలిస్తూ రాణిస్తున్నారు. అటు నగరంలోనూ, ఇటు జిల్లాలోని పలు ఆలయాల్లో, ఆశ్రమాల్లో ఇటీవల వీరు ప్రదర్శించిన కళారూపాలు అందరినీ బాగా ఆకట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తిరుమలలోని శ్రీవారి ఆలయం చుట్టూతా వున్న నాలుగుమాడ వీధుల్లో కన్నులపండువగా జరిగే శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవ ఊరేగింపులోనూ వాత్సల్య చిన్నారుల కోలాటం భజనల ప్రదర్శనకు ఆహ్వానం రావడం ఎంతో అరుదైన విషయమే. జనహిత-వాత్సల్య సంస్థలోని నిరాధార బాలబాలికలకు ఈ సదవవకాశాన్ని సాక్షాత్తూ ఆ దేవదేవుడే ఒక వరంగా ఇచ్చినట్లుగా భావించవచ్చు. ఆ చిన్నారులందరికీ కలియుగ ప్రత్యక్షదైవమైన ఆ తిరుమలేశుని అనుగ్రహం, ఆశీస్సులు తప్పక వుంటాయని భావిస్తూ, స్వామివారి సన్నిధి చెంత కోలాటం కళారూపాన్ని ప్రదర్శించనున్న చిన్నారులందరికీ 'లాయర్' శుభాకాంక్షలు.

# ఆసియాలోనే నెంబర్‌వన్‌గా నెల్లూరు

- ప్రపంచబ్యాంకు నివేదికలో వెల్లడి





ఎవరెన్ని ప్రతిబంధకాలు కల్పించినా, ప్రభుత్వాలు, పాలకులు చిన్నచూపు చూసినా భవిష్యత్‌లో అభివృద్ధి పరంగా రాష్ట్రంలో నెల్లూరుజిల్లానే నెంబర్ వన్ అవుతుందని 'లాయర్' ఎప్పటి నుండో చెబుతూవుంది. ఇప్పుడు ప్రపంచబ్యాంకు కూడా అదే చెబుతోంది. ఆసియాలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాల్లో నెల్లూరుజిల్లాకు ప్రపంచబ్యాంకు మొదటి స్థానమిచ్చినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ప్రపంచబ్యాంకు తన నివేదికలో నెల్లూరుజిల్లాకు పెద్దపీట వేసింది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించబడ్డ కృష్ణపట్నంపోర్టు, దేశంలోనే శరవేగంగా అభివృద్ధిచెందిన శ్రీసిటీ సెజ్‌ల మూలంగా నెల్లూరుజిల్లా పారిశ్రామికంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నట్లు, ఆసియాలోనే నెంబర్‌వన్ స్థానంలో ఉన్నట్లు ప్రపంచబ్యాంకు తన నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. దీని గురించి పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడికావచ్చు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com